Regd. No. H-18.

విడిప్రతి 30 పైసలు.

శుక్రవారం 28-5-71

రస్టన్ ఆయిల్ ఇంజన్
అమ్మబడును
24—26 H. P.
కండిషన్‌లోవుండి రైసుమిల్లులు పని చేయుచున్నది.
— వివరములకు —
సి. ఏ. శేషారెడ్డి,
మడమనూరు.

# జనార్ణవం

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడుగారు

సంపుటి 43 సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి సంచిక 21

27-5-71 గురువారమునుండి
నెల్లూరు శ్రీ లీలామహల్‌లో
★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★
Death on the Arena
డెత్ ఆన్ ది ఎరీనా
★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★
బెన్‌హర్‌లాంటి చిత్రాలకు మించిన కలర్ చిత్రము.

# ఎటుచూచినా తెలుగుదేశం భవితవ్యం ఒకేఒక వ్యక్తిపై ఆధారపడివుంది!

( మా హైదరాబాదు విలేఖరి )

ఆదిలోనే హంసపాదన్నట్టు ప్రభుత్వం, ఎన్. జి. ఓ. ల మధ్య చర్చలకు ఆదిలోనే విఘ్నం కలిగింది. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారు ఢిల్లీనుంచి, ఎన్. జి. ఓ. లతో చర్చలు మే 24 న జరుగుతాయని, పరిష్కారం సంభవమేనని ప్రకటించినప్పుడు మే 25 న కాకపోతే 26 నాడైనా 45 రోజుల సమ్మె విరమణ జరిగిపోతుందన్న ఆశాభావం అందరిలో కలిగింది.

కాని మే 24 వచ్చేటప్పటికి పరిస్థితి నిరాశాజనకంగా తయారైంది. సంభాషణ



ఈయనమీద కాదు—

లకు సిద్ధంగా వున్నామని ప్రభుత్వానికి వ్రాసింది సమ్మెకు నాయకత్వం వహిస్తున్న ప్రభుత్వోద్యోగుల సంయుక్త కార్యాచరణ సంఘం కన్వీనరు. ముఖ్యమంత్రితో చర్చలకు రావలసిందిగా ప్రభుత్వప్రధాన కార్యదర్శి వ్రాసిన లేఖను సంబోధించిందికూడా కార్యాచరణ సంఘం కన్వీనరుకే. తీరా చర్చలకు వచ్చిన కార్యాచరణ సంఘం నాయకులతో మీలో వుద్యోగులైనవారితో మాత్రమే మాట్లాడుతాను, ఉద్యోగేతర రాజకీయ నాయకులు చర్చల్లో పాల్గొనడానికి వీల్లేదని ముఖ్యమంత్రి తెలియజేసేశారు.

ఇలాంటి వైఖరిని ఆశించని సమ్మెనాయకులకు ఇదొక కొత్తసమస్యై కూర్చున్నది.

ఈలోగా వెలువడేనాటికి చర్చలు ప్రారంభమై రాజీమార్గాన కొనసాగుతాయని చెప్పడానికి ఆధారం ప్రస్తుతం కనిపించడంలేదు.

ముఖ్యమంత్రిగారికి ఎవరైనా మాట్లాడడానికి రావడమే "దిగిరావడం"(క్లైంబింగ్ డౌన్)గా కనిపిస్తున్నట్టుంది. చర్చలు జరగాలని అభిలషిస్తున్నామని ఉద్యోగుల సంఘం ఉత్తరం వ్రాయడంలోనే వారి దిగిరావడాన్ని సూచిస్తున్నదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.



ఈయనమీదనే!

నలభైరోజులకు పైగా సమ్మెచేసి, నెల జీతాలులేక కష్టాల్లోవున్న ప్రభుత్వోద్యోగులు చర్చలద్వారా పరిష్కారానికి సంసిద్ధంగా ఉన్నామని తెలియజేసినంత మాత్రాన దాన్ని దిగిరావడంగా చిత్రించడమంటే కష్టింపుగా వుంటుంది. కాని కష్టింపుగా మాట్లాడడం అధికారంలోవున్న నాయకులు అలవర్చుకున్న కొత్త అలవాటుగా తోస్తూన్నది.

★ ★ ★

క్రితంవారం, ప్రధానమంత్రి తెలంగాణా సమస్య శాశ్వతపరిష్కారంకోసం తొక్కారావుగారు చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారనీ, ఆమె వీటి ననుసరించి ఏవో చర్చలు తీసుకోబోతున్నారని ఢిల్లీనుంచి వార్త వచ్చింది. దీనిపైన ప్రజాసమితి అధ్యక్షుడు డాక్టర్ చెన్నారెడ్డి వ్యాఖ్యానిస్తూ తాము ప్రధానితో చర్చలకు సంసిద్ధమేనన్నారు. అంతేకాక తెలంగాణా సమస్యకు మూడే పరిష్కారాలున్నాయన్నారు. ఒకటి ప్రత్యేకరాష్ట్ర నిర్మాణానికి వెంటనే అంగీకరించడం, రెండవది యథాతథస్థితిని కొనసాగించడం, మూడవది మధ్యేమార్గం ఏమైనా వుంటుందేమో అన్వేషించడం. మూడవమార్గం విషయంలో ప్రధానమంత్రితో సంభాషించడానికి తాను సిద్ధమేననీ, ఇలాంటి చర్చలు కొనసాగించడానికి ప్రజాసమితి తనకు పూర్తిగా అధికారాన్ని ఇచ్చిందనీ డాక్టర్ చెన్నారెడ్డి అన్నారు. తొక్కారావుగారు తనకుతోచిన విధంగా తెలంగాణా సమస్యా పరిష్కారానికి కృషి చేస్తున్నారనికూడా ఆయన చెప్పారు.

చెన్నారెడ్డిగారు అవలంబించిన వైఖరి చాలా అనుకూలంగావుంది. దీని ఆధారంగా ప్రధానమంత్రి పరిష్కారాన్వేషణ కొనసాగించాలని, ఆమె నిర్ణయానికి కట్టుబడి వుంటామని అందరూ ప్రకటిస్తే పరిష్కారానికి ద్రోహం చేసినవారవుతారని తొక్కారావుగారు మరోప్రకటన చేశారు.

తొక్కారావుగారెలాంటి ప్రతిపాదనలు చేశారో తనకు తెలియదనీ, అసలు తొక్కారావుగారికే తెలియకపోవచ్చుననీ, కాని తెలంగాణాగూర్చి కొత్త ప్రతిపాదనలు ప్రధానమంత్రి ముందేమీలేవనీ, తనకు సంబంధించినంతవరకు తెలంగాణా ఆర్థికాభ్యున్నతికి మాత్రమే సంబంధించిన సమస్య అనీ అందుకై ప్రధానమంత్రి ప్రకటించిన అష్టాంశ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామనే బ్రహ్మానందరెడ్డిగారు ప్రకటించారు. దానితోపాటే, "చెన్నారెడ్డిగారి వైఖరిలో మార్పురావడం ముదావహం, ఆయనే మధ్యేమార్గంగూర్చిమాట్లాడుతున్నారంటే దిగివస్తున్నారన్న మాట" అని కూడా బ్రహ్మానందరెడ్డిగారు చెప్పినట్లు ప్రకటించారు. ఐతే రెండురోజుల తర్వాత "దిగిరావడంగూర్చి" తనేమీ అనలేదని పత్రికావార్తలను ముఖ్యమంత్రి ఖండించారు. "ఇలాంటి విషయాల్లో దిగిరావడం ఎక్కడంలాంటివి వుండవు. పరస్పర అవగాహన, కలిసి కృషి చేయడం వుండాల"నికూడా ముఖ్యమంత్రి చెప్పారు.

ఇలాంటిఅవగాహనమాత్రంకనిపించడం లేదు. తెలంగాణా సమస్యంటూ ఏదీలేదని బ్రహ్మానందరెడ్డిగారన్నప్పుడు అందులో అవగాహనకాని కలిసి పనిచేయాలన్న

—తరువాయి 5 వ పేజీలో

# ద్రోహం!

ఏ వ్యక్తికోసమైతే కాంగ్రెస్‌సంస్థ రెండు ముక్కలైందో; ఏ వ్యక్తికోసమైతే కాంగ్రెస్ నాయకులు సర్వత్యాగాలాచేసి మానసిక వ్యథకు గురియైనారో; ఏ వ్యక్తికోసమైతే దేశ రాజకీయాలు సంక్షోభం చెందాయో— ఆ వ్యక్తి, తన వెనుక నిలిచిన సంస్థమీద, నాయకులమీద నాలుగు విసుర్లు విసిరి, దానికి రాజీనామాయిచ్చి, తాను పార్టీల కతీతుణ్ణయ్యానని ప్రకటించడం ద్రోహం కాక మరేమవుతుంది? వెన్నుపోటు పొడవడం కాక మరేమవుతుంది? ఆత్మవినాశకరం కాక ఇంకేమవుతుంది?

సంజీవరెడ్డిగారు హైదరాబాదులో పత్రికావిలేఖరులకు వెలిబుచ్చిన అభిప్రాయాలను పరిశీలిస్తే, ఆయన ఆలోచనలు గందరగోళంగా వున్నట్లనిపిస్తుంది; అశాంతంగం పొందినవ్యక్తి మాటలుగా కనబడతాయి. సంకుచితమైన పార్టీ సంబంధాలకు దూరమవుతున్నానంటాడు; మరి పార్టీ సభ్యత్వానికికూడా రాజీనామా యిచ్చారా అంటే, కాంగ్రెస్ అధ్యక్షుడుగాకూడా వుండినతనకు సంబంధం పోవంటాడు; జాతీయ సమస్య ఏదైనా వుత్పన్నమైై, తన అవసరంవుంటే, తాను ముందు నిలబడగలనని సాధికారికంగా హామీయిస్తారు. దీని భావమేమిటో అర్థం కావడంలేదు. పోనీ, రాజకీయాలతో విసుగుపుట్టి సన్యాసం స్వీకరిస్తారా అంటే, అదీలేదు. రేపు ఎన్నికల్లో పార్టీలనుబట్టి కాక, అభ్యర్థుల అర్హతలనుబట్టి బలపరుస్తాడట. తన ఎన్నికలో శ్రీమతి ఇందిరా గాంధీ చేసింది అదేకదా! ఇందిరా గాంధీని విమర్శించడాన్ని ఆయన విమర్శిస్తాడట. దానివల్ల ప్రయోజనం లేదంటాడు. మొన్న బొంబయి ఎ. ఐ. సి. సి. సమావేశంలో



కూడా ఈ విధంగానే మాట్లాడాడు. శక్తి సంక్షోభంలో ముందువెనుకలు చూడకుండా మాట్లాడడం తప్పితే, సంజీవరెడ్డిగారికంటే ఇందిరాగాంధీని సరిసుగా దుయ్యబట్టినవారెవరున్నారు? మొన్న పార్లమెంటు ఎన్నికలో ఆయన ప్రచారం అంతా ఇందిరాగాంధీకి ఒక మామూలు పౌరస్త్రీని మాట్లాడినట్లు, తనహోదాతో తన వ్యక్తిత్వంతో పోల్చుకుంటే అమెదాలాదీన్మైనట్టుగా మాట్లాడడం తప్పితే, ఆశయాల సిద్ధాంతాలనుగూర్చి చెప్పనేలేదే! ఆ సంజీవరెడ్డే ఈనాడు తక్కినవారికి నీతులు బోధించడానికి సాహసిస్తున్నాడంటే

—తరువాయి 5 వ పేజీలో

వోల్టాస్ లిమిటెడ్‌వారి

Phone : Office 1049
Res. 765

ఇంటర్‌నేషనల్ ట్రాక్టర్లకు

వెంటనే దరఖాస్తులు పంపండి.

మీకు కావలసిన

★ ఇంటర్నేషనల్ ట్రాక్టర్ స్పేర్‌పార్టులకు, సర్వీసింగుకు
★ ఫరిదాబాద్ లక్ష్మీరతన్ లిస్టర్ ఇంజన్లకు
★ N. E. I. అండ్ క్రాంప్టన్ ఎలక్ట్రిక్ మోటార్లకు
★ డీప్‌వెల్ గార్డన్ రిచ్ పంపులకు
★ వోటా పంపులకు
★ ఇతర వ్యవసాయ పరికరములకు
★ భూమితనఖా బ్యాంకులు, ఇతర బ్యాంకుల ద్వారాను గ్యారంటీతో ఇవ్వబడును.

వెంటనే మాతో సంప్రదించండి

——— ఇట్లు ———

బాలాజీ ఏజన్సీస్ అండ్ ఇండస్ట్రీస్

వోల్టాస్ లిమిటెడ్‌వారి ఆథరైజ్డు డీలర్సు
(చిత్తూరు, పాత నెల్లూరుజిల్లాలకు)

15/529, ఉయ్యాలకాలవరోడ్డు, (R. R. Street)
నెల్లూరు– 1.

మంచి భవనం అమ్మకం

నెల్లూరు దర్గామిట్టలో, కస్తూరిదేవి విద్యాలయానికి ఎదురుగా, లోగడ ఇన్‌కంటాక్సుఆఫీసు వుండిన భవనం అమ్మబడును. 230 అంకణాల ఖాళీజాగా; రెండంతస్తుల పెద్దభవనం అమ్మబడును నెలకు వెయ్యి రూపాయల బాడుగవచ్చే భవనం ఇది. వివరములు క్రిందివారివల్ల తెలిసికోవచ్చును.

-పి. గోపాలకృష్ణయ్య,
C/o. మాగుంట రాఘవరెడ్డి,
రాయాజీవీధి - నెల్లూరు.

★★ జమీన్ రైతు ★★

శ్రీ విరోధికృతు వైశాఖ శుద్ధ చవితి శుక్రవారం 28-5-71

# రైతును శిక్షించకండి!

విద్యుచ్ఛక్తి రేట్లు జూన్ 1 తేది నుండి పెరగబోతున్నవి. నోరు చచ్చిన నెల్లూరు రైతాంగం, కేవలం అసెంబ్లీ సభ్యులే అయిన జిల్లా శాసనసభ్యులు తప్ప, రాష్ట్రమంతటినుండి ఆందోళన జరిగినా, రేట్లను పెంచుటకే నిర్ణయించుకున్నది. రేట్లు పెంచినందువల్ల రైతాంగం ఎంత భారాన్ని మోయవలసివచ్చేది, ఈ విషయంలో ప్రజలలో అలజడి ఎంత తీవ్రంగా వుండేది విద్యుచ్ఛక్తి బోర్డువారే గమనించలేకపోతున్నది; ప్రభుత్వం కూడా గుర్తించలేకపోవడం, కదలక పోవడం విచారకరం.

ప్రజాందోళనకు జవాబుగా విద్యుచ్ఛక్తి బోర్డు ఛైర్మన్ ఒక ప్రకటన జారీచేశారు. మూడేళ్ళక్రితం 31 లక్షలుండిన నష్టం 1971-72, అంటే ఈసంవత్సరం, 4 కోట్ల 75 లక్షలకు పెరుగుతున్నదట. రేట్లు పెంచినా, 40 లక్ష. నష్టం వుండనే వుంటుందట. గత మూడేళ్లలో గ్రామీణ విద్యుత్ పథకాలకు 54 కోట్ల రూపాయలు వ్యయపరచడం జరిగిందట; కాని పంపుసెట్లవల్ల, గ్రామీణ విద్యుత్ కార్యక్రమాలవల్ల 5 కోట్లుకూడా రాబడి రాలేదట; ఇది చాలాతక్కువట. మద్రాసువాళ్ళ నైవేలీనుండి విద్యుచ్ఛక్తి తీసుకుంటున్నారట; వారికి యూనిట్ 5.7 పైసలకే గిట్టుకున్నదట; ఇతర ఖర్చులేమీ లేవట; మద్రాసుకు బాగ అభివృద్ధి చెందిన గ్రిడ్‌లు వున్నాయట. ఇక ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి, 'అతి సమర్థవంతంగా' నిర్వహింపబడుతున్న కొత్తగూడెంలోనే యూనిట్ వుత్పత్తి ఖర్చు 7.5 పైసలు అవుతున్నదట. అధికార ఆంధ్రలోని జలవిద్యుదుత్పత్తి కేంద్రాలైన మచ్‌ఖండ్, ఎగువసీలేరులు ఒకమూల వుండినందువల్ల ట్రాన్స్‌మిషన్ ఖర్చులు, ట్రాన్స్‌మిషన్‌నష్టము అత్యధికమట. ఆంధ్ర విద్యుదుత్పత్తి అధికంగా థర్మల్ స్టేషన్లవల్ల జరుగుతున్నదట; వాటి ఇంధనానికే సంవత్సరానికి 5 కోట్లు అవుతున్నదట. ఆంధ్రలో వినియోగదారుకు ఒకయూనిట్ విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలంటే యూనిట్‌కి 26 పైసల ఖర్చవుతున్నదట. ఆంధ్రలో పెంచబడబోతున్న రేటు హరియానాలో సమానమట. మహారాష్ట్ర, బిహారులలో యూనిట్ రేటు 18 పైసలట. అందువల్ల ఆంధ్రేమేలు, మేమే చాల వుదారం అంటాడు ఛైర్మన్ శ్రీ కృష్ణస్వామి.

తగ్గించనన్నపుడు చెల్లించక చేసేదేమీలేదు. కాని కృష్ణస్వామిగారి ప్రకటనను ఆసాంతం చదివితే మా కర్థమవుతుందేది-అమలుజరిగిన గ్రామీణ విద్యుత్ పథకాలు దండగమారినవని ఆయన అభిప్రాయ పడుతున్నాడనుకో వలసి వస్తున్నది. నిజమే. గ్రామీణ విద్యుత్ పథకాలు వాటి వుపయోగము, రాబడి దృష్టితోకాకుండ, రాజకీయ కారణాలతో అమలు జరపబడుతున్నవి. అన్నీ ఆ విధంగానే జరుగుతున్నాయని చెప్పలేముకాని, ఆ విధంగా జరిగేవికూడా తక్కువకాదని ఒప్పుకొనితీరాలి. పథకం అమలు జరగడానికి అగ్రిమెంట్లు గిగ్రిమెంట్లు ఎక్కువగా ఇవ్వబడుతాయి; గిట్టుబాటు రాబడులు కాగితాలమీద ఎక్కువగానే చూపబడుతాయి. అజరున అమలు జరిగినప్పుడు, స్కీము దండగమారింది గా రుజువవుతుంటుంది. అధికార్లకు గిట్టుబాటుకాదని తెలిసినా, వారు ఆ విషయం ఎత్తిచూపినా, వారిమాట సాగదు; రాజకీయవాదుల అభీష్టానుసారంగా వారు నడుచుకోక తప్పదు. రెండవది- ఒకచోట విద్యుత్ సౌకర్యం వున్నపుడు, దాని చుట్టుపక్కల విస్తరింపచేయకుండా, ఎక్కడో మారుమూలగా కొత్తస్కీములు చేపట్టబడుతాయి. ఇంకొకటి- ఒక్కోసారి స్కీములు త్వరగా పూర్తికావు. స్తంభాలు నాటబడతాయి, వైర్లు లాగబడతాయి, కాని సరఫరా ఇవ్వడం జరగదు. ఈ అన్ని కారణాలవల్ల పెట్టిన పెట్టుబడి లెక్కకు వస్తుందికాని, ఆదాయం కనబడదు.

విద్యుత్ సరఫరా పరిస్థితి సరిగా లేదు. సమర్థవంతంగానేను రోజులో కొన్ని గంటలపాటు సరఫరావుండనేవుండదు. రోజులో ఎన్నో సార్లు పోతూవస్తూ వుంటుంది. గ్రామాలలో అయితే, సరఫరాకు విఘాతం కలిగితే, పునరుద్ధరణకు చాలకాలం పడుతుంది. రెండు మూడురోజులపాటుకూడా పునరుద్ధరింపబడని సందర్భాలు అసంఖ్యాకంగా వుంటాయి. దీనివల్ల రైతుల తదితర వినియోగదార్ల ఇక్కట్లసంగతి అటుంచి, సరఫరా రోజుల పర్యంతమో, గంటల పర్యంతమో నిల్చిపోయినందువల్ల విద్యుచ్ఛక్తిబోర్డుకు రావలసిన ఆదాయం ఎంత పోతుంది అనేది ఆలోచించాలి. ఇదీకాక దొంగతనాలు తక్కువకాదు. రైతులకు సంబంధించికూడా దొంగతనాలున్నా, ఆ శాతం చాలతక్కువ. ఇతర రంగాలలో-ముఖ్యంగా పారిశ్రామిక తదితర రంగాలలో ఎక్కువని విషయజ్ఞులంటారు. ఇవంతా నష్టమేగదా!

ఇవి విషయం ఆలోచించకుండా, ఏటిని అరికట్టుటకు చర్యలు తీసుకోకుండ, సరఫరా సమర్థతను పెంచకుండా, గిట్టుబాటును గమనించక రాజకీయ కారణాలతో నష్టంవచ్చే పథకాలను చేపట్టడం మానకుండా; పెట్టుబడికి తగినరాబడి రాలేదని, రైతులనెత్తిన అదనపు బరువును వేయడం అన్యాయమే అవుతుంది. అసలు ప్రభుత్వం నష్టాన్ని భరించి అయినా, ఇప్పుడున్న పన్నెండు పైసల రేటునే తగ్గించడం సమంజసంగా వుండేది. పన్నెండుపైసలరేటు ఎక్కువని రైతులు తమలో తాము గొణుక్కోవడమే కాని, ఆందోళన చేయని కారణంగా, ప్రభుత్వం వున్నదాన్ని పెంచడానికి పూనుకోవడం వుచితంకాదు. వ్యవసాయం గిట్టుబాటుగాలేదు. ఖర్చులు పెరిగిపోయాయి, మిగిలేది తగ్గిపోతున్నది. ఈ పరిస్థితుల్లో విద్యుచ్ఛక్తి రేటుకూడా పెరిగితే, ఒక పంటలోనే రైతు సంతృప్తి పడడం తప్ప గత్యంతరం లేదు. అది వుత్పత్తిని దెబ్బతీస్తుంది దాని చెడు ఫలితం ఈ ఏటికీయేడు కనపడకపోవచ్చుకాని, అది తీవ్రంగా వుండగలదు. ఆహారోత్పత్తి కుంటుపడిపోగలదు. ప్రకృతి వైపరీత్యాలుకూడా తోడైతే, మిగులు అనుకునేది తరుగుగా తప్పదు. ఆ పరిస్థితిని ప్రభుత్వం చేజేతులా తెచ్చుకోవడమే అవ్వగలదు, అందువల్లే విద్యుచ్ఛక్తి రేట్లు పెంచక ప్రయత్నాన్ని విరమించుకోవలసిందిగా కోరుతున్నాము. ఆహారోత్పత్తిచేసే రైతును శిక్షించవద్దని విజ్ఞప్తి చేస్తున్నాము.

---

# ఈవారం విశేషాలు

★★★

## రైల్వే ప్రయాణం

రైల్వే ప్రయాణం రానురాను సామాన్యుడికి సులభంతంగా వుండడంలేదనరిగదా, పోనుపోను సోషలిస్టు నినాదాలు జాస్తవుతున్నకొద్దీ యీ రైల్వేప్రయాణం ఖరీదుకూడా జాస్తయిపోతున్నది. మొన్న 24 తేది కొత్త రైల్వేమంత్రి హనుమంతయ్యగారు పార్లమెంటులో ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెటులో రైల్వేప్రయాణ- రవాణాలఖరీదు 35 కోట్లమేరకు పెంచబూచ్చున్నారు.

ప్రయాణీకుల ఛార్జీలు, సరకులరవాణా ఛార్జీల పెరుగుదలరేట్లు రేపు జులై 1 తేది నుండి అమల్లోకి వస్తాయి. రైలు ప్రయాణీకుల ఛార్జీల పెరుగుదలవల్ల సంవత్సరాదాయం అదనంగా 13కోట్ల 20లక్షలు, అంటే రేపు జులై 1 తేది నుండి 1972 మార్చి ఆఖరుదాకా అంతమయ్యే 9 నెలలకు 9 కోట్లా 75 లక్షల ఆదాయం పెరుగుతుందని అంచనావేశారు. ఇందులో థర్డ్‌క్లాసు ప్రయాణీకులవల్ల వచ్చేదే ఎక్కువమొత్తంలో వుంటుందట. థర్డ్‌క్లాసు ప్రయాణీకులవల్ల 8 కోట్లు డిల్లర, మిగతా పైక్లాసువారివల్ల 1 కోటిడిల్లర అదనపు ఆదాయమట! అదీ మనసోషలిజం! అట్లనే సరకుల రవాణాఛార్జీల హెచ్చింపువల్ల ఈ సంవత్సరానికి 16¼ కోట్ల అదనపు ఆదాయం వుంటుందట. అంటే ఈ రైల్వే ఛార్జీల హెచ్చింపువల్ల మొత్తం ఆదాయం 26¼ కోట్లు పెరుగుతుందనీ, తద్వారా మొదట వుంటుందనుకున్న 33 కోట్ల బడ్జెటు లోటు 6¾ కోట్లకు తగ్గుతుందని అంచనావేస్తున్నారు.

గూడూరునుంచి హైదరాబాదుకు 654 కిలోమీటర్ల దూరం ఎక్స్‌ప్రెస్ థర్డ్‌క్లాసు రైల్వేప్రయాణానికి చార్జి 75 పైసలు పెరుగుతుంది. అట్లనే నెల్లూరునుంచి బెజవాడకు ఎక్స్‌ప్రెస్ రైల్వే ప్రయాణం (థర్డ్‌క్లాసు) ఖరీదు 50 పైసలు పెరుగుతుంది. నెల్లూరు-గూడూరు రైల్వే టిక్కెట్టు 20 పైసలు, నెల్లూరు- మద్రాసు రైల్వే టిక్కెట్టు 25 పైసలు పెరుగుతుందన్నమాట. ఈ రీతిగా రేపు జులైనుండి రైల్వే ప్రయాణం పద్దక్రింద జనంచేత అదనపుడబ్బు సమర్పయామి అవుతుందన్నమాట.

> ### ఇందిరమ్మ అదృష్టవంతురాలు!
>
> —రంగాజీ ఉవాచ.
>
> ఇందిరమ్మ నిజంగా అదృష్టవంతురాలు- మొన్న ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించినందుకేకాదు, తన సోషలిస్టు పథకాల అమలు సమస్యను, ప్రధానమైన దేశ ఆర్థిక సమస్యలను మ్రింగివేయగలిగిన బంగ్లాదేశ్ సమస్యవచ్చిపడ్డదిగనుక, దేశప్రజలదృష్టి చాలామటుకు అటువైపు మళ్ళిందిగనుక, అమె కొంత 'సోషలిస్టు వూపిరి' తీసుకోడానికి కొంతటైము ఏర్పడింది. ఈ పరిస్థితుల్లోఅమె'సోషలిజం'కొంతకాలం వాయిదావడాల్చివచ్చినా ఆ యమ్మ అదృష్టవంతురాలు కాదని ఎవరనగలరు?- అని ఆచార్య రంగాగారు మొన్న మద్రాసు-ఢిల్లీ టి.టి.ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుంటే గూడూరు స్టేషన్‌లో మా విలేఖరి పలకరించినపుడు చెప్పిన మాటలివి.

అట్లనే సరకుల రవాణా ఛార్జీలుకూడా పెంచినందువల్ల వివిధరకాల సరకుల ధరలుసైతం పెరిగి, జనం అదనపుధరలు అచ్చుకోవల్సి వుంటుంది. ప్రతిపిటికి సోషలిజం వల్లించే ప్రతిమంత్రి బడ్జెటు ప్రవేశపెట్టినప్పుడల్లా సామాన్య జనం ఈ రీతిగా అదనపు భారాన్ని మోయాల్సి వస్తున్నది. జనం నడుములు క్రుంగిపోతున్నవి. అయినా మనది సోషలిస్టువంథా గదా! చవాన్‌గారి బడ్జెట్‌లో ఇంకా ఏమేమి పన్నుల బాధలుంటాయోగదా!

పార్లమెంటు సమావేశం జులై 28తేది దాకా జరుగుతుందట. రాజ్యాంగం సవరణ బిల్లు ఈ సమావేశంలో వుండకపోవచ్చునంటున్నారు.

## బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ సమస్య రావణాసురుని కాష్టంలాగా కాలుతూనేవుంది. పాక్ కవ్వింపుచర్యలు మితిమీరిపోతూనే వున్నాయి. పాకిస్తాన్ సైన్యాలు ఇండియా సరిహద్దుదాటి భారత భూభాగంలోకి చొచ్చుకుని వస్తున్నాయి. భారత గస్తీ కేంద్రాలపై పాక్ సైనికదళాలు ఫిరంగి కాల్పులుకూడా యధేచ్ఛగా సాగిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాల పొడుగునా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడివుంది. అస్సాం - తూర్పుబెంగాల్, మేఘాలయ- తూర్పుబెంగాల్ సరిహద్దుల్లో భారతభూభాగంపై కవ్వింపు చర్యలకుదిగి పాక్‌సైన్యాలు జరిపిన కాల్పుల్లో మొన్న రెండు రోజుల్లో దాదాపు 30 మంది భారతీయులు మరణించినట్లు చెప్తున్నారు భారతీయ రక్షణదళాలు ఈ

—తరువాత 5 వ పేజీలో

---

◆◆

# జనవాణి

## జమీన్ రైతు- ప్రశంసలు, విమర్శలు

గత కొన్ని సంవత్సరాలుగా జమీన్ రైతు పాఠకులను పరిశీలిస్తున్న పాఠకులమైన మేము-వయస్సు పెరిగేకొద్దీ పత్రిక నిత్యనూతనంగా భాసిస్తున్నదని చెప్పడానికి సంతోషిస్తున్నాము పత్రికలోని వ్యవసాయరంగ శీర్షిక మాకెంతో ఆనందాన్ని కలుగజేస్తున్నది. వ్యవసాయ రంగంలో వస్తున్న అద్భుతమైన మార్పుల్ని సమగ్రంగా అందజేస్తున్నందుకు మీరు అభినందనీయులు. మనదేశం పూర్తిగా వ్యవసాయకదేశమైనా ఆ రంగంమీదనే ప్రజలకు శ్రద్ధ, విజ్ఞానం తక్కువైన ఈరోజుల్లో దీక్షగా మీరుజేస్తున్న సేవ అమోఘం ఈశీర్షికను మరింత విస్తృతంచేసి శాస్త్రీయంగా ప్రాణవంతంగా కొనసాగించడం అత్యవసరం.

మన దైనందిన జీవితంలో భాగమైపోయిన రాజకీయనాయకుల వూకదంపుడు వుపన్యాసాలకు, వారికిజరిగిన సన్మానాలకు ప్రాధాన్యత కనపర్చినా నూటికి నూరుపాళ్ళు పత్రికను వాటితోనే నింపకుండా ప్రజలకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని కల్పిస్తారని ఆశిస్తున్నాం.

ఆంధ్రలో 'అధికార కాంగ్రెసుకు అరడజను సీట్లొస్తే జాస్తి' అని అన్ని పెద్ద పత్రికలతోపాటు మీహైదరాబాదు విలేఖరి కూడా తప్పటడుగువేసినా ఈవారం మత సంస్థ పత్రికపై అతని విమర్శ నిశితంగాను, నిర్మాణాత్మకంగానువుంది. 'లోకలిస్టు'గారి 'కూనిరాగాలు' శీర్షిక విజ్ఞానప్రదంగా వుంటుంది.

జానపద శైలిలో శివారెడ్డిగారి మధుర కవిత్వం ఆయన హాజరైన సమావేశాలకో, ఆయన వెళ్ళలేకపోయిన ఆహ్వానాలకు క్షమార్పణలు చెప్పడానికో, తనజూసిన సినిమాలకో సినిమాపోస్టర్లకో తానువెళ్లిన మారాజుల వివాహాల జాబితాను యివ్వడానికో, వాటిల్లో జరిగిన విందుల వర్ణనకో, ఆ వధూవరుల్ని శ్లాఘించడానికో పరిమితమైపోవడం శోచనీయం, మాకెంతో బాధాకరమైన అంశం.

> ### లారీ విలయం!
>
> లారీలు ప్రజలపాలిటి మృత్యుదేవతలుగా తయారయ్యాయని నిత్యం రుజువవుతున్నా, ప్రభుత్వం ఏ చర్యా తీసుకోవడంలేదు. 25 తేది రాత్రి హైదరాబాదు - కర్నూలు రోడ్డులో మహబూబ్‌నగర్ జిల్లా పాలెం అనే గ్రామంవద్ద భామాకలాపం ప్రదర్శనం జరుగుతున్నదట. వందలాదిజనం తన్మయులై చూస్తున్నారు. ఇంతలో వట్టుతప్పిన ఒకలారీ వారిమీదుగా దూసుకపోయింది. అక్కడికక్కడే 69 మంది చచ్చారు; ఇంకో పదిమంది మృత్యుముఖంలో వున్నారు. ఆ దృశ్యం భయానకంగా వున్నదని, అది మృత్యుహేల అని హోంమంత్రి శ్రీ వెంగళరావు చెప్తున్నారు. ఈదారుణ సంఘటన తర్వాత ప్రభుత్వం అలోచిస్తున్నదట- రాత్రిపూట లారీ రవాణాను నిషేధించాలని. ఇవి ఎప్పుడో చేసివుండవలసినపని.

ఇందిరమ్మగారి సోషలిజం దొంగజపానికి దాసోహం కావొద్దని హెచ్చరిస్తూ మీరు వ్రాసిన సంపాదకీయాలు నిష్పక్షపాతనాలైనా, ప్రజాస్వామ్య దేశంలో ప్రచురించబడే పత్రికగా మీ బాధ్యతను మీరు కొంతవరకు విస్మరిస్తున్నారేమో. తమను నమ్మిన సత్యాన్ని నిండుగా నిర్భయంగా కవితలద్వారా చెప్తున్న నారపరెడ్డి శ్లాఘనీయులు.

ఇకపోతే మీ వివాహ శీర్షిక చదువుతుంటే మాత్రం మీరింత ఛాదస్తులైపోయారేమా అనే సందేహం కలుగుతుంది. కావలిస్తే మీరే ఆశీర్షికను ఒక పాఠకుడిగానిష్పాక్షికంగా పరిశీలించి చూడండి. ఫలానా శాంత మూర్తి, నిగర్వి, నిరాడంబరుని కుమారునికి; ఫలానా ధర్మమూర్తి, కష్యపతి, సాధుస్వభావి, సౌమ్యశీలి కుమార్తెకు వివాహం జరిగిందని ఇంకా ఏవేవో అరడజను పొగడ్తలను తగిలించడమెందుకు? అసలు వివాహం జరిగేది వారికా లేక వారి పిల్లలకా అనే సందేహం కల్గుతు'ఉంది వొక్కొక్కసారి. వధూవరుల విద్యార్హతలను సుగుణాలను ప్రచురించడం సబబేమోకాని (కావలిస్తే ఫొటోలతో సహా) ఇలా వ్రాయడం సమంజసమా? అసలు జమీన్ రైతుకు వివాహాహ్వానం పంపినవారల్లా పైఅరడజను సుగుణాలకు అర్హులవుతారేమో నసిపిస్తుంటుంది. పొగడ్తలకు వీకింత పదసముదాయం ఏ నిఘంటువు సరఫరా చేస్తుందా అని ఆశ్చర్యమేస్తుంటుంది. ఏమైనా ఈ శీర్షిక కాస్త ఎబ్బెట్టుగా వుంటున్నది మీరేమైనా అనుకోండి 'ఇల్‌స్ట్రేటెడ్ వీక్లీ'లో ఆఖరు చివరి పేజీలో 'దిస్మాల్ పెక్స్' శీర్షికక్రింద వారు ప్రచురించే విధానాన్ని అనుసరిస్తే బాగుంటుందేమో ఆలోచించగలరనివిశ్వసిస్తున్నాము.

బాపట్ల —వై. వేణురెడ్డి, జి. సుదర్శనరెడ్డి, పి. ఆదిశేషారెడ్డి.

▼

—తరువాత 6 వ పేజీలో

# సంస్థాకాంగ్రెస్ ఈదారిబడితే.....

"ఇండికేట్‌తో గౌరవ పూర్వకమైన పొత్తు అసాధ్యమైతే, ముక్కలు చెక్కలై వున్న సోషలిస్టు శక్తులను కూడదీయడమే మన కర్తవ్యం. గత్యంతరం కనిపించదు ఈ సంస్థ ముందడుగువేసి డెమోక్రటిక్ సోషలిజంలో విశ్వసించే పార్టీలన్నిటిని కూడగడితే, ఇందిరాగాంధి ముక్తిమార్గం చూపడంలో విఫలమైనప్పుడు ఆ నగా ప్రజలకు తానుచేసిన వాగ్దానాలను ఆమె చెల్లించుకోలేనపుడు, ఆ బాధ్యత ను

## వారం వార్తల్లో

వహించడానికి మరొక ప్రజాస్వామిక పక్షం సిద్ధంగావుంటుంది. ఈ విధంగా జరగక పోతే, దేశం విపరీతంగా కుడిపక్షానికి లేదా విపరీతంగా ఎడమపక్షానికి జరిగి పోతుంది. ఈ రెండు మలుపులు ప్రజా స్వామికానికి అపాయకరం. దేశానికి వుపద్రవకరం."

"విశాలమైన ప్రజావుద్యమం నిర్మాణం కావలెను ఈసంస్థ ఆధ్వర్యాన ఆ నిర్మాణం కావలెనంటే, డెమోక్రటిక్ సోషలిస్టు శక్తుల నన్నిటిని కూడదీయవలెను. ఈ చరిత్రాత్మకమైన పాత్రను ఈ సంస్థ నిర్వహించవలసి యున్నది."

పై పలుకులు ఎవరివి? రాజేశ్వరరావ్ అన్నాడా లేక సుందరయ్య అన్నాడా? ప్రేమ్‌భాసిన్ అన్నాడా?

వీరెవరూకాదు. మనకందరికీ చిరపరిచితులైన నీలం సంజీవరెడ్డి, టి. సి. కొండయ్యగార్లది పై నుడువులు.

ఇటువంటి వాక్యాలు మాకు శ్రవణానందం. ఏ వేదికనుండైనా సరే ఎవరు పల్కినా, ఇటువంటి పలుకులకు మేము స్వాగతం పల్కుతాం.

సంస్థాకాంగ్రెస్ ఈ దారిబడితే అచిర కాలంలో రెండు కాంగ్రెస్ సంస్థలు ఏకం కాగలవు. రెంటిలోనుంచీ డెమోక్రటిక్ సోషలిస్టులు కానివారు తొలగిపోతారు. దేశానికిది శుభప్రదం.

* * *

ఇంతకంటే శ్రవణానందంగా వుండే పల్కులు ఇందిరాగాంధి ముఖతః వెల్వడినవి. కార్మికసంఘాలన్నిటి ప్రతినిధులను సమావేశపరచి మన ప్రధాన మంత్రి స్పష్టీకరించిన అంశాలు గమనించ దగినవి: "పారిశ్రామిక రంగంలో శాంతి నెలకొనడం పేదలకు చాలముఖ్యం. సంఘటిత శక్తిగల కార్మికులేకాక పనిలభించని వీరలు అనేకమంది వున్నారు. వారికి పారిశ్రామిక శాంతి ముఖ్యమైనది అసలు జాతీయజీవనం గడవాలంటే పారిశ్రామిక సంబంధాలు సవ్యంగా వుండవలెను. ఇందులో కార్మికులు ప్రముఖపాత్ర వహించవలెను. సమ్మెలు, ఫ్యాక్టరీమూతలు చాల అధికమైనవి. శాంతిమయ వాతావరణం కూడా తగ్గింది. లేబర్‌పక్షాన, మేనేజిమెంట్ పక్షాన, వాదించేవారు భారతదేశపు దారిద్ర్యనిర్మూలనం అనే పెద్ద విషయాన్ని గమనిస్తున్నారా లేదా అనే సంశయం కలుగుతున్నది. సంఘటితమైన కార్మికబృందానికి కార్మిక సంఘాలున్నవి. యజమానుల సంఘాలు యజమానుల కున్నవి. కాని గుర్తుదిక్కుని, నోరు లేని అశేషమైన జనావళి యోగక్షేమాలకై శ్రద్ధ వహించే వారెవరు కన్పించడంలేదు."

18 కార్మికసంస్థల ప్రతినిధులు హాజరైన ఆ సమావేశంలో కేంద్ర లేబర్‌మంత్రి కూడ పలికినాడు. "మనమిప్పుడు అసాధారణమైన స్థితిలోవున్నాం. ఇప్పుడే మన ఉత్పత్తి అధికం కావలెను. కాని ఇప్పుడే లక్షలకొలది ప్రతిసంవత్సరం శ్రమించకుండా చెడిపోతున్నది. పనిలేనివారికి పని కల్పించవలసిన బాధ్యతవుండగా, పారిశ్రామిక అశాంతిమూలాన పనివున్నవారికి కూడా పనిలేకుండా చేయడమవుతున్నది. పనిలోనుంచి వేలమందిని తొలగిస్తున్నారు. ఆవల సరిహద్దున కల్లోలంవచ్చింది. అందువలన మనదేశంమీద భారం అధికంగా పడింది. కొంచెం కోలుకునేస్థితిలో మళ్ళీ ప్రతిష్టంభన వచ్చిపడుతున్నది. ఇట్టి పరిస్థితిని ఇక పు డనీయరాదు. ఈమార్గాన్ని అరికట్టవలెను."

ఇంకా వినండి: "విశేషంగా కాపిటలిస్టుగావుండే సమాజంలో వర్గస్పర్థవలన కార్మికసంఘాల ప్రాధాన్యం పెరిగింది. ఆ సంఘాలపోరాటం అన్నిపనులకంటె ముఖ్యమనిపించింది. తమ హక్కుల రక్షణకై కార్మికులు ఆ సంఘాలద్వారా పోరాడినారు. ప్రస్తుతం మనదేశంలో మనం సమతాసమాజాన్ని స్థాపించదలచుకున్నాంగనక, ఇందుకై కార్మికసంఘాల కర్తవ్యమేమిటో తెలియవచ్చిందను కుంటాను. ఇక్కడ యజమానులు – కార్మికులు తమకు లోగడ స్వాభావికమైన స్పర్థను కలిగివుండవలసిన అవసరంలేదు. అందరంకలిసి సోషలిజంవైపుకు వెళ్ళుతున్నాము. ఈదిశలో పబ్లిక్‌సెక్టర్ సంస్థలకు ప్రాముఖ్యం వచ్చింది. వాటిలో వర్కర్లు–మేనేజర్లు ఉమ్మడిగా శ్రద్ధ వహించి కృషిచేయవలసియున్నది."

ఇంకావినండి: "ప్రయివేట్ సెక్టర్‌లో కూడా ఈ ప్రభావం పడుతున్నది. అందువలన కార్మికసంఘాలు కేవలం రక్షణ కోసం, ఆందోళనకోసంమాత్రమే ఇక్కడ పనిచేయవు. గవర్నమెంట్ పథకాలను అమలజరిపే బాధ్యత వాటిపైవున్నది. శక్తివంచనలేకుండా ప్రభుత్వోద్దేశ్యాలను పాలించడానికి అవి పాటుపడవలెను. కార్మికోద్యమానికి నూతన దృక్పథం అవసరం. ఉత్పత్తిశక్తిని పెంచడంకూడా కార్మికులకర్తవ్యం. పనిలేకుండా బాధపడే కార్మికులు ఎంతోమంది వున్నారు. వారికి సాయపడవలసిన ధర్మంకూడా వున్నది. అందువలన పరస్పరం వైరాలుంటే కార్మికసంఘాలు వాటిని తగ్గించుకొని, మేనేజిమెంట్లతో సంప్రదించుకొని, పారిశ్రామికశాంతిని కాపాడవలెను. ఇరుపక్షాలు తమ బలాలను గట్టిగా పెంచుకుని సంప్రదించుకుంటేసమాధానంతప్పకవస్తుంది."

ఆ సంప్రదింపులలో కార్మికసంఘాలు

—కొరవ 8 వ పేజీలో

## లోకవృత్తం

లోక సంచారి

# సాదత్ చేసినపని మంచిదా? చెడ్డదా?

సాదత్ చేసినపని మంచిదేనా? ఖండితంగా మంచిదని ఎవరూ చెప్పలేకున్నారు. చెడ్డదా? అదీ నిర్ణయం కాలేదు. కాలం దొర్లినకొద్దీ ఎవరి అభిమానాలను బట్టి వారు సాదత్ చర్యపై వ్యాఖ్యలు చేస్తూవుంటారు.

ఇటువంటిచర్య ఎక్కడైనా జరిగినప్పుడు మేముకోరేది ఒక్కటే అధికారాన్ని వశపరచుకున్న పక్షంగాక అణచివేయబడిన పక్షం వైపునుంచికూడా మనకు వృత్తాంతం అందవలెను. రెండూ తెలుసుకుని మనం ఏదైనా ఒక అభిప్రాయానికి రాగలము. అప్పుడుకూడా మన అభిమానాల–దురభిమానాల పాత్ర అట్టి అభిప్రాయానికి రావడంలో కొంచెమైనా వుండకపోదు. దానిపాత్ర కొంతేగనక సాధారణంగా వ్యాపించే అభిప్రాయాలలో నిజస్థితికి అమితదూరమైన భావాలు వుండవు.


అసలీ ప్రపంచంలో ఒక నూతన నినాదంతో ఒక ఉద్యమం రావలసివున్నది. ఆ నినాదమెట్టిదనగా: Dissenters of the world, unite! అభిప్రాయ భేదం గల బృందాలన్నీ ఏకంగావలెను. అంటే? ప్రతిదేశంలోనూ అధికార్లు కొందరిని అణచివేస్తూవుంటారు. అణచివేయబడిన వారినిగూర్చి లోకానికితెల్పే ఏర్పాటు ఒకటి వుండవలెను. అణచివేయబడిన బృందపు నాయకులు తదితరులు తమ వాదాన్ని తమదేశపు ప్రజలకు, ప్రపంచానికి తెల్పుకొనే హక్కును కలిగివుండవలెను. దానిని వారు చలాయించేటప్పుడు అధికార్లు అడ్డురాకూడదు అడ్డువస్తే లోకనిందకు వారు గురిఅవుతారు.

అటువంటి పద్ధతి అమలజరిగిననాడు అనేకదేశాలలో జరిగే ఘటనల తాత్పర్యం ప్రపంచ ప్రజానీకానికి బోధపడుతుంది.

ఇంతేగాక ఏకపార్టీ రాజ్యంలో ఆ పార్టీలో అధికారపక్షాన్ని ఎదిరించే వారుంటే, వారి నుడువులకు ఆపార్టీపత్రికలలో గౌరవప్రదమైన స్థానంవుండవలెను. ఇంకొక పార్టీ లేదుగనుక ఆపార్టీలోనే ఆపార్టీ సిద్ధాంతాలకు కట్టుబడిన ప్రతిపక్షం అవసరమైతే ఏర్పడడానికి అవకాశం వుండవలెను.

ఐతే అధికారిని బలపరచడం లేదా కృష్ణజన్మస్థానాన్ని అలంకరించడం–వళ్ళీ మాట్లాడితే యమపురికి రవాణా గావడం. ఇటువంటి పరిస్థితి నాగరిక లక్షణంగాదు.

—కొరవ 8 వ పేజీలో


దిగుబడి నధికం జేసే గ్రోమోర్ కాంప్లెక్స్ ఎరువులు వాడితే, అధిక లాభాలు ఖాయం. ఎక్కువ పోషక పదార్థాలున్న గ్రోమోర్ కాంప్లెక్స్ ఎరువులు అన్ని రకాల పైర్లకు బాగా పనికొస్తాయి, ఎందుకనంటే :

■ వాటిలో నత్రజని అమోనియా రూపంలో ఉంటుంది. ■ వాటిలో ఉన్న భాస్వరామ్లం పూర్తిగా నీటిలో కరుగుతుంది. ■ అవి గుళ్ళు గుళ్ళుగా ఉండటం వల్ల అన్ని విధాలా అనువైనవి.

గ్రోమోర్ వాడటం వల్ల పంట దిగుబడి ఎట్లా పెరిగేది దేశం అంతటా వేలకు వేల రైతులు తెలుసుకున్నారు. మీరు కూడా గ్రోమోర్ వాడి లాభాలు సంపాదించండి!

గ్రోమోర్ అమోనియం ఫాస్ఫేట్ 28-28-0 గ్రోమోర్ ఎన్.పి.కె. 22-22-11

గ్రోమోర్ అమోనియం ఫాస్ఫేట్ 20-20-0 గ్రోమోర్ యూరియా 46-0-0

మీకు కావలసిన గ్రోమోర్ ఎరువులు మీకు దగ్గరలో నున్న ప్యారీ వారి ఎరువుల డిస్ట్రిబ్యూటర్ల వద్ద కొనండి.




చేనుకు చేవ
రైతుకు రొఖ్ఖం—
గ్రోమోర్

కోరమాండల్
ఫెర్టిలైజర్స్

AIYARS-CF 158 TL-AP

## నెల్లూరు నలుచెరగుల్లో

**విమర్శకుడు**

# స్టేట్‌బ్యాంకి టవున్‌బ్రాంచిలో 10 వేలు చోరీపోయింది- మద్రాసు పోలిస్ చెప్పేవరకు బ్యాంకివాళ్లకు తెలియలేదు!

మాకుమాత్రం ఈ వృత్తాంతం విచిత్రంగా, ఆశ్చర్యంగావుంది. బ్యాంకిలో డబ్బుపోతే, పోలీసువాళ్లు చెప్పేవరకు తెలియకుండడమనేది ఆశ్చర్యమేగదా!

నెల్లూరు స్టేట్‌బ్యాంకు (తాలూకాఫీసు వద్దవుండేది) టవున్‌బ్రాంచి ధనాగారంలో (సేఫ్) ఏదో కొయ్యపని చేయడానికి మద్రాసు బీనార్ లిమిటెడ్‌వాళ్లు సుబ్బయ్య అనే వడ్రంగిని పంపిదారట. అతను నాలుగురోజులపాటు పనిచేసాడట. అతను పనిచేసిన ఈనాలుగురోజులు-అతను పని చేసినంత సేపు - బ్యాంకి వుద్యోగులిద్దరు కావలా వుండినారట అతను పని పూర్తి చేసుకొని మద్రాసుకుకూడా వెళ్లిపోయాడు. అతను వచ్చింది ఏప్రెల్ 26తేదీ; తిరిగి వెళ్లింది బహుశా 29, 30 తేదుల్లో వుండవచ్చు.

మే 22 తేది మద్రాసు మైలాపూర్ పోలిసువాళ్లు బ్యాంకివాళ్ళకు ఫోను చేశారట-మీ బ్యాంకిలో 10 వేలు డబ్బేమైనా పోయిందా అని అప్పుడు కండెల్పుకొని, బంగారెత్తి, సేఫ్ రూమ్‌లోని డబ్బు లెక్క చూచుకోగా 10 రూపాయల కాగితాల 'బండిల్' ఒకటి అదృశ్యమైవున్నదట. ఆ బండిల్ విలువ పదివేలరూపాయలు!

సదరు వడ్రంగి సుబ్బయ్యను మద్రాసు పోలిస్ ఇంకేదో సందర్భంలో పట్టుకోగా, ఈ దొంగతనం బయటపడ్డట్టుంది సుబ్బయ్య ఈ దొంగతనం తర్వాత జల్సాగా వుండినాడట బ్రాన్ని స్టర్ల కొనడం, యాత్రలు సాగించడం, మొక్కుబడులు చెల్లించడం, విలాసంగా వుండడం-ఇవంతాచూచి అనుమానంతో పట్టుకున్నట్లున్నారు. ఈ జల్సాలన్నిటికిపోను అతని వద్ద షుమారు నాలుగవేల రూపాయలు మాత్రం మిగిలివుండినట్లు తెలుస్తున్నది. అతనివద్ద ఆస్తిపాస్తులు లేకుంటే, తక్కిన ఆరువేలు ఎవరు అచ్చుకోవలసి వస్తుందో ఏమోమరి!

బ్యాంకి ధనాగారంలో నోట్లకట్టలు మెష్ బిగించిన ర్యాకులలో వుంటాయట. కావలా అధికారులు వేమరపాటులోవున్న ఘడియలు పసికట్టి, మెష్ స్క్రూలు వూడదీసి, డబ్బు తస్కరించి, మళ్లీ స్క్రూలు బిగించివుండవచ్చునని అనుమానించబడుతున్నది. ఏరోజుకారోజు లెక్కచూచుకొనే డబ్బుకాదుకాబట్టి, వెంటనే కనుక్కునే అవకాశం లేకుండాపోయివుంటుంది. ఏమైనా లోపల కావలావున్నవారు అప్రమత్తంగా వుండివుంటే, ఈవిధంగా తస్కరించడం అంత సులభంకాదని అంటారు.

### వేణుగోపాల కళాశాల

వైష్ణవముఖులు గాంధీకాలేజి ప్రయత్నం వీడకలేపు దో ఏమోకాని; మూల బడిందనుకున్న మూలపేట వేణుగోపాలస్వామి ఆఁరు కాలేజి ముందుకొచ్చింది; బి ఎ, బి. కాం. క్లాసులతో ఈ జూలైలోనే, తాత్కాలికంగా దేవాలయసత్రాలోనే ప్రారంభమవుతుంది. ఈసందర్భంలో ప్రెసిడెన్సి రి డాక్టరు జగన్నాధరెడ్డి అధ్యక్షంలో 27 తేది వచ్చిన యూనివర్సిటీ కమిషను, భవనాలతో, కాలేజి నిర్వహించుకోగలిగిన వేణుగోపాలస్వామి స్థితితో సంతృప్తిపడిపోయారట.

వేణుగోపాలస్వామి తన నిధులను కాలేజి కైంకర్యానికి వినియోగించుటకు సమ్మతించినట్లున్నాడు; ప్రసాదంద్వారా కమిషను సభ్యులకు అవిషయాన్ని ఎరిగించినట్లున్నాడు. కమిషను సభ్యులూ కాలేజి ప్రారంభానికి తమ సంసిద్ధతను వేణుగోపాలునికి తెలిపినట్లున్నారు-ప్రసాదాన్ని స్వీకరించారుకాబట్టి! వివరాలు ఎరువారం. ఏమైతేనేమి, నెల్లూరుకు ఈ ఏడు మరోకాలేజిరాబోతున్నది అదే సంతోషం.

### విద్యుచ్ఛక్తి బిల్లులు- ఉద్యోగుల జబర్దస్తీ

25 తేది నెల్లూరులో జమీన్‌రైతు చుట్టుప్రక్కల విద్యుచ్ఛక్తి బిల్లులకు సంబంధించి గోలైపోయింది. మార్చి బిల్లులు చెల్లించని వారి ఫ్యూజులు పెరుక్కొని రమ్మన్నారట; అంతే, ఒక ఉద్యోగివచ్చి చెప్పేది వినకుండానే దురుసుగా జబర్దస్తీగా పెరుక్కొని వెళ్ళిపోయాడట ఇక వినియోగదారులు లబోదిబోమంటూ ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు పరుగులు తీయవలసివచ్చింది.

అసలు మార్చినెల బిల్లులు పిల్చివ్వరికీ రాలేదట. వీళ్లకేమిటి-జమీన్‌రైతుకుకూడా రాలేదు. వీళ్లందరికేకాదు, కొన్ని గ్రామాలకుకూడా రాలేదు. బిల్లులురాని కారణంగా కొందరు చెల్లించలేదు; కొందరు తమంత తాము విచారించుకొని కట్టారు. 25 తేది ఫ్యూజులు పెరక్కపోవడానికి వస్తే; చెల్లించాము, రసీదులు చూపుతాము అనిచెప్పి, ఇంట్లోకిపోయి తెచ్చేలోగానే పెరుక్కొని పోవడం జరిగింది. కొందరివైతే 1968 లో బాకీలట- అవికూడా చెల్లించబడినవే-వారివి కూడా నిర్దాక్షిణ్యంగా పెరుక్కొని పోవడం జరిగింది. ఎలక్ట్రిసిటీ ఆఫీసువద్ద కుమ్మో మొర్రో అంటూ మూగిన వందలాదిజనాన్ని చూస్తే, ఈ జబర్దస్తీ వ్యవహారం ఇక్కడొక్కచోటేకాదు, టవునులో అనేకచోట్ల జరిగిందనుకోవలసివచ్చింది.

బిల్లులకు సంబంధించి విద్యుచ్ఛక్తి ఆఫీసులో విపరీతమైన అబందరలుంటున్నవి. బిల్లులు పంపరు; చెల్లించినవి జమ వ్రాసుకోరు; వసూలుకు ఈవిధంగా జబర్దస్తీ పద్ధతులవలంబిస్తారు. సమ్మెకాలంలో బిల్లులు చెల్లిచిన ఎంతోమంది రైతులు, రసీదులు భద్రపరచుకోని కారణంగా, మళ్లీ చెల్లించవలసివచ్చింది. 1968 లో బాకీవుంటే, ఈమూడేళ్లనుండి నిద్రపోతూ ఇప్పుడు ఫ్యూజులు పెరుక్కొనిరమ్మనే అధికార్లు, అపరాధాలు విధించే అధికారులు, తమ అఫీసులోని ఈఅబందరలకు కారకులైనవారిమీద ఏమిచర్యతీసుకుంటున్నారు? విద్యుచ్ఛక్తిశాఖతో ప్రజలు విసిగివేసారి భగ్గుమనే స్థితికి వచ్చివున్నారు. అవిషయాన్ని వున్నతాధికారులు తెలిసికోవడం అవసరం.

ఏమైనా ప్రతిదానికి వినియోగదార్ల సంఘాలు లేనిదే ప్రజలకు ప్రభువులచేత, ఉద్యోగులచేత ఇటువంటి మొట్టికాయలు తప్పవు. విద్యుచ్ఛక్తి, టెలిఫోను వినియోగదార్ల సంఘాలు వెంటనే ఏర్పడడం అవసరం. సేవానక్తులైనవ్యక్తి ఎవరైనా పూనుకుంటే సంతోషిస్తాము.

### సీ ఐలెండ్ కాటన్ దినోత్సవం

స్వర్ణంగుమిల్లు పాలకులు గోపాలకృష్ణయ్య-కృష్ణమూర్తిగారలు, సీ ఐలెండ్ కాటన్ సాగు వ్యాప్తికి విశేషంగానే కృషి చేస్తున్నారు. ఈ సందర్భంలో 6-6-71 తేది ప. 3 గంటలకు టి. ఎ. హాలులో సీ ఐలెండ్ కాటన్ దినోత్సవం ఏర్పాటు చేశారు మంత్రులు కాకాణి అధ్యక్షిస్తారు; భగవంతరావుగారు ప్రారంభోత్సవం జరుపుతారు బహుశా మనమంత్రి సంజీవరెడ్డిగారుకూడా పాల్గొనవచ్చు.

అరోజు వుదయం ఒకటి రెండు బస్సులతో మంత్రులు, రైతులు బయలుదేరి వివిధ గ్రామాలలోని పత్తి క్షేత్రాలను సందర్శిస్తారు కుతూహలంగలిగిన రైతులందరూ ఈసందర్భనంలో, సభలో పాల్గొనవచ్చు.

### సూళ్లూరుపేట బి.డి.ఓ.

దేవిడ్‌గారు ఎక్కడ కాలుపెట్టినా నిప్పుగావుంది. ప్రెసిడెంటు తదితర సమితి అనధికారసర్గం-బి. డి. ఓ మధ్య పరిస్థితి భగ్గుమంటున్నదట. అనధికార్లతో సామరస్యంగా మెలగలేని ఇటువంటి అధికార్లను పంచాయతిరాజ్‌శాఖలో లేకుండాచేయడం అవసరంకదా!

### స్త్రీ దుర్మరణం

వెడిచెర్లకు పోవడానికి 26 తేది వుదయం గూడూరులో రేణిగుంట ప్యాసింజరు ఎక్కిన ముమ్మారెడ్డిబుజ్జమ్మనే 20ఏ ళ్లస్త్రీ; గూడూరుదాటి కొంతదూరం పోయాక, మరచిపోయివచ్చిన మందుల సంగతి జ్ఞాపకానికొచ్చి, రైలు దిగుటకు తలుపుహ్యాండిల్ పట్టుకొని నిలబడివుండగా జారి క్రిందపడి, టీర ఫుట్‌బోర్డుగో తగులుకున్న కారణంగా చక్రాలక్రిందకు లాగబడి, నలిగి కాళ్ళుచేతులు తెగిపోయి, మనిషి మాంసపు ముద్దయిపోయింది. ఆమెతోటి ప్రయాణం చేస్తుండిన ఆమెతల్లి గొలుసు లాగి రైలునాపింది కాని, కూతురు ప్రాణాలను నిల్పుకోలేకపోయింది.

ఈ బుజ్జమ్మక్రిష్ణ నాయుడుపేట సమీపం భీమవరం వాసి శ్రీముమ్మారెడ్డి రామచంద్రారెడ్డి భార్యట. అ రోజు ఆమెను గూడూరులో రైలెక్కింది, తాను బస్‌లో భీమవరం పోయాడు. పాపం! ఆ ఎక్కించడం యమపురికెక్కించడమే అయింది.

### లాడ్జిలో చావు

టవునుహాలుకు ఎదురుగావుండే చంద్ర భవన్ లాడ్జిలో- నాగిశెట్టి శంకరయ్య అనే కడప జిల్లా కొత్తూరువాసి 25 తేది రాత్రి ఎండ్రిన్ త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడట రూ 100 లు పోగొట్టుకోగా, తండ్రికి భయపడి ఆత్మహత్య చేసుకున్నట్లు అతను ఒక చీటీ వ్రాసిపెట్టాడట. తన మృతదేహాన్ని తన తల్లిదండ్రులకు అప్పగించమని పోలీసుకు వ్రాశాడట

### పోతన జయంతి

శ్రీ ఆకిలి మల్లికార్జునయ్య ఏర్పాటుచేసిన నిధిలో ఏటేటా జరిగే పోతన జయంతి మొన్న 26 తేది టౌన్ హాలు రీడింగ్ రూములో జరిగింది. దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు రు. 116 లతో సన్మానింపబడ్డారు. సభకు జిల్లా కలెక్టరు పర్సనల్ అసిస్టెంటు శ్రీ కె. వెంకటశివయ్య అధ్యక్షత వహించారు. శివయ్యగారికి తెలుగు ప్రాచీన కావ్యాలన్నీ కొట్టిన పిండిగానే వున్నట్లున్నాయి. ఎందులోనుండైనా వుంటారు పుంఖంగా పద్యాలు తడుముకోకుండా శ్రావ్యంగా వల్లించగలగడం ఆయనకు కొనుచివ్వలావుంది. హిరణ్యకశిపుని పాత్ర చిత్రణలో పోతన ప్రదర్శించిన ప్రతిభనుగూర్చి కన్విన్సింగ్ గా చెప్పారు రాజ్యంకోసం భార్య సీతను వదులుకున్న రాముణ్ణి పూజిస్తాంగానీ, ఆ రాజ్యంకోసం పుత్రుడైన ప్రహ్లాదుణ్ణి వదులుకోవల్సివచ్చిన హిరణ్యకశిపునివల్ల మనకు సానుభూతి చూపే ఔదార్యం లేకపోవడం విడ్డూరమన్నారు. పోతనగారి కొన్ని కవిత్వ నాణ్యతల్నిగూర్చికూడా నిండుగాచెప్పారు. దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు పోతన కవితారీతులపై పెద్ద వ్యాసాన్ని వ్రాసుకుని చదివారు. అందులోని కొన్ని భాగాలను వచ్చేవారం చదవగలరు.

శ్రీ వెంకటశివయ్యగార్నిగూర్చి మకోరె గారు వట్ల మప్పిపోయిన ప్రశంసోక్తులతో పరిచయం చేసారు.

### అగ్నిప్రమాదం- స్త్రీ మరణం

మొన్న 25 తేది గూడూరు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రక్కన జరిగిన అగ్నిప్రమాదంలో అమంచర్ల సుశీలమ్మ అనే 40 ఏళ్ళ స్త్రీ సజీవ దహనమైపోయింది.

రాత్రి చిమ్నీలేం దీపవుబుడ్డి వెలిగించుకుని గోడనవున్న చెక్కమీదపెట్టి గడి వేసుకుని నిద్రపోయిందట. వేకువజామున మంటలేచి ఇల్లు తగులుకుంది. తలుపు తీసేందుకు వీల్లేకపోయి ఆమె మంచం మీదనే మరణించింది. ప్రక్కనున్న మల్లెల లక్ష్మయ్య ఇల్లు కూడా పూర్తిగా కాలిపోయింది.

—

## ఒంగోలు

### బంగ్లాదేశ్ నిధి

ఆంధ్రప్రదేశ్ బంగ్లాదేశ్ నిధి అధ్యక్షులు శ్రీ పి చిన్నపరెడ్డి విజ్ఞప్తిననుసరించి ఒంగోలు మాజీ ఎమ్మెల్యే డాక్టరు బి. వి యల్. నారాయణగారు వెయ్యి రూపాయలకు చెక్కు పంపారు. జిల్లాలో అతిరధులు, మహారథులు, ఇద్దరు మంత్రులున్నా బంగ్లాదేశ్ విషయం ఎవరూ పట్టించుకున్నపాపానపోలేదు

### మతిమరుపు

ఈనెలలో జరిగిన ఒంగోలు కాలేజి ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఉదయం బుక్‌కీపింగ్‌బదులు మరొక పరీక్ష వుంటుందని యూనివర్సిటీవారు మార్చగా ఆ విషయం ప్రిన్సిపాల్‌గారు కాలేజి వుపాధ్యాయులకు సర్క్యులర్ పంపారటగానీ, వుపాధ్యాయులు పిల్లలకు చెప్పకపోవడంతో చాలా తికమకపడ్డారు. అయ్యవార్లకూ మతిమరుపు వచ్చిందా?

### అద్దెకొంపల అగచాట్లు

ఒంగోలులో అద్దె ఇళ్లలో వున్నవాళ్ల అగచాట్లు చెప్పనలవిగాకుండా పోతున్నాయి. 50 రూపాయల అద్దె వుండేది 80, 90 ఇవ్వండి ఇళ్ళను ఖాళీచేయమని కూర్చుంటున్నారు జిల్లా వచ్చినతర్వాత మున్సిఫ్‌కోర్టులో నూరుకుపైగా అద్దె ఇళ్లవారి పిటిషన్లు పెట్టివున్నారు. ఇంకా జిల్లా ఆఫీసులు రావల్సినవివున్నాయి. అవివస్తే యీ బాడుగిళ్ల సమస్య ఇంకాస్త కష్టమవుతుంది. అత్యవసర ప్రణాళికక్రింద గృహనిర్మాణాలుచేపట్టదే పరిస్థితివిషమిస్తుంది.

### రైల్వేస్టేషను

ఒంగోలు జిల్లాకేంద్రమైనప్పటికి రైల్వేస్టేషనుమాత్రం జిల్లాస్థాయికి తగ్గట్టుగా లేదు. ప్లాట్‌ఫారాలపై పూర్తిగా కప్పు వేయలేదు. రెండు ప్లాట్‌ఫారాల్లో నీటి సరఫరా సరిగాలేదు. విజయవాడ డివిజనులో ప్రధానమైన స్టేషనుఅయినా రిజర్వేషన్లకు సౌకర్యం లేకపోవడం శోచనీయం. రైల్వేఅధికారులు తగుచర్యలు తీసుకుంటారా?

### కరెంటు - ఫోన్లు

కలెక్టరు శంకరన్‌గారి ధర్మమా అని కొండపి రింగ్‌రోడ్డు పథకం క్రింద కొన్ని గ్రామాలకు కరెంటు వచ్చిందిగానీ, మిగతా గ్రామాల విషయంలో స్తంభించి పోయినా ప్రజలు కొన్ని లక్షల రూపాయలు డిపాజిట్లు కట్టి కరెంటు తెచ్చుకున్నారుగానీ సప్లయి చాలా అధ్వాన్నంగావుంది ఒక్కోసారి రోజుల పర్యంతం కరెంటు సప్లయి ఆగిపోయి కూర్చుంటున్నది. ఈ నామర్దా పరిస్థితిని బాగుచేసే అధికారులేరా?

జూన్ 15 తేది లోపల 120 కొత్త ఫోను కనెక్షన్లు ఇచ్చేందుకు పోస్టు శాఖవారు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

### సిలంవారి రాజీనామా- కేశవరావు షాక్!

సిలం వి. శివారెడ్డిగారు సిండికేట్‌నుంచి రాజీనామా ఇచ్చినదానిపై మీ అభిప్రాయ మేమిటని రాష్ట్ర సిండికేట్ అధ్యక్షులు శ్రీ బి. సి. కేశవరావును అడగ్గా ఆయన "నాకు షాక్ ట్రీట్‌మెంట్‌లాగా వుంది. ప్రస్తుతం చెప్పేదేమిలేదు. త్వరలో హైదరాబాదులో సిండికేట్ నాయకవర్గం సమావేశమవుతుంది" అన్నారు. స్టేట్‌మెంటివ్వ నిరాకరించారు.


## కావలెను

శ్రీ పరాశరభారతి కిశోర విజ్ఞాన విద్యారామము, సింగరాయకొండలో పని చేయుటకు చక్కని బోధనా సామర్థ్యము గల్గిన సెకండరీ గ్రేడు ఉపాధ్యాయినులు కావలెను. సంగీతములో ప్రవేశమున్న వారికి ప్రాధాన్యత యివ్వబడును. దరకాస్తులు యీక్రిందిచిరునామాకు 12-6-71 తేదిలోగా చేరవలెయును

మేనేజింగ్ ట్రస్టీ,

**శ్రీ పరాశర భారతి,**

సింగరాయకొండ, ఒంగోలుజిల్లా.

## ఉబ్బసమునకు చేపమందు

8-6-71 తేది మంగళవారం మృగశిరకార్తె ప్రవేశ సందర్భమున అదినము సూర్యోదయంనుండి సూర్యాస్తమయంలోగా ఉబ్బసము, క్షయ, దీర్ఘకాల కడుపునొప్పులు, దగ్గులు మొదలైన వ్యాధులకు చేపలోకాని, బెల్లములోకాని మందు కూర్చి యివ్వబడును. ఈవిధముగా గత 23 సం॥ నుండి మావద్ద సేవించినవారు అనేకమంది పై వ్యాధులనుండి విముక్తులై వున్నారు. కనుక సంవత్సరములో ఒక్క రోజుమాత్రమే లభించు ఈ అవకాశమును జారవిడువకోవలదని కోరుచున్నాము. ఔషధము ఖరీదు రూ. 1-50 లు.

**డా॥ యన్. బాబురావు,**

రంగనాయకులపేట - నెల్లూరు.



### కడప డి॥ ము॥ కోర్టులో

ఇ ఏ నెం. 184 ఆఫ్ 70

అసలు నెం. 24 ఆఫ్ 70

మజారెడ్డి రామలక్షమ్మ —వాది.

గానుని వగైరాలు —ప్రతివాదులు

ఈ ప్రతివాదుల స్వాధీనంలోవుండు దిగువ షెడ్యూలు భూములు ఆవరవల్లి తాలూకు స్థావరాస్తిని యీ కోర్టువారు 14-6-71 తేదిన వేలం వేయబడును. సవాలుదార్లు వచ్చి సవాలు చేయవచ్చును.

షెడ్యూలు: కడప తాలూకా సంది మండలంగ్రామం పొలంలో:

| బాబువారి | డి. నెం. | య. సెం. | కిమత్తు |
|---|---|---|---|
| 1. నంజ | 697/2 | 0 21 | రూ. 500 |
| 2. డిటో | 697/3 | 0-11 | రూ. 200 |
| 3. డిటో | 696 | 0-18 | రూ. 200 |

—ఎ. ఎం. మాధవరావు

వాది అడ్వకేటు.

# సంజీవరెడ్డి

(మొదటిపేజీకొరవ)

ఏమనాలి? అనుకున్నపదవి రానందు వల్లనో, ఎన్నికల్లో ఓడిపోయినందువల్లనో మానసికంగా తల్లక్రిందులైపోయి, బాధ్యత గలవారు ఇట్లా మాట్లాడ్డం ప్రజలదృష్టిలో ఎంత చులకనగా వుంటుంది!

బెంగుళూరు ఏ. ఐ. సి. సి లో సంస్థను యువకులకు అప్పగించాలని ఆయన ప్రబోధించాడు. తనను వర్కింగు కమిటీ మీటింగులకుకూడా పిలువవద్దన్నాడు. మొన్న హైదరాబాదు విలేఖరులతోకూడా - ప్రెసిడెంటుగా రామ్‌సుభాగ్ సింగునో- వీరేంద్ర పాటిల్ నో, హితేంద్రదేశాయ్‌నో పెట్టి వుండవలసిందని, పార్టీ నాయకత్వం సరిగా వ్యవహరించలేదని విమర్శించాడు. తన సలహాలను, సూచనలను ఖాతరు చేయలేదనికూడా వాపోయాడు. అధ్యక్ష ఎన్నికలో సంజీవరెడ్డికేకాదు, పెక్కుమందికి అసంతృప్తి కలిగింది. నిజలింగప్ప వారసుడు రామ్‌సుభాగ్ సింగ్ అనేది ఎంతో కాలంగా అందరూ అనుకుంటున్నదే. మొన్న బెంగుళూరులోకూడా పోటీకి సిద్ధపడ్డాడు సింగ్. అటువంటి రామ్‌సుభాగ్‌సింగ్ బహిరంగంగా పల్లెత్తుమాట అనలేదు. పై నాయకుల వరకు వనిలేదు; మన బి. సి. కౌ దయ్యకూడా రామ్‌సుభాగ్‌సింగ్ అధ్యక్షుడైవుంటే బాగుండేదనే అభిప్రాయం కలిగివున్నాడు. అటువంటి కొండయ్య కూడా ఎక్కడా ఏమీ ప్రకటనలు చేయలేదే! అటువంటిది సంజీవరెడ్డి బహిరంగంగా- నాయకులమీద ఆరోపణగా చెప్పవలసిన అవసరం ఏమి వచ్చింది? పదేపదే తన పెద్దరికాన్ని ప్రకటించుకునే సంజీవరెడ్డి, రాష్ట్రపతిత్వాన్ని దురదృష్టంతో (అహంతో) పోగొట్టుకున్న సంజీవరెడ్డి- అనుసరించవలసిన వైఖరేనా ఇది?

విచిత్రం- సిండికేట్‌లో, ఆ మాటకొస్తే కాంగ్రెస్‌లోనే, ఈనాడు సంజీవరెడ్డి చూపుతున్న లోపాలు కొత్తవేమీకాదు. ఏ ఎన్నికలోకూడా కాంగ్రెస్ నాయకుల మధ్య ఏకాభిప్రాయంవున్న దాఖలాలు లేదు. రాష్ట్రపతిగా సంజీవరెడ్డిగారి పేరు ప్రతిపాదింపబడినపుడు- అది ఏకగ్రీవంగా ఆమోదింపబడలేదు. ఆయన్ని బలపరచిన వారికికూడా- ఆయనకంటే అర్హుడైనవ్యక్తి ఇంకొకరులేరనే అభిప్రాయంలేదు. ప్రధాని ఇందిరాగాంధీమాత్రం విభేదించింది, వ్యతిరేకించింది; దాని పరిణామాలు మనకు తెలుసు. ఈనాడు సంజీవరెడ్డి అనుసరిస్తున్న వైఖరికి, ఆనాడు ఇందిరాగాంధీ అనుసరించినవైఖరికి తేడాఏమిటి? ఆనాడు ఇందిరాగాంధీని దుయ్యబట్టిన పెద్దమనిషి ఈనాడు తానాపని ఎట్లాచేస్తాడు? కాలం ఖర్మం వ్యతిరేకించిందనే అసహనంతో అస్తవ్యస్తంగా వ్యవహరించడం, మాట్లాడడం ఏమిమర్యాద? ఎవరికి లాభం?

యువకులు, సోషలిజము అనేమాట చాలానలిగిపోయాయి. ఎవరినోటబట్టినా ఇవేమాటలు. సంజీవరెడ్డిగారుకూడా వీటినే వల్లిస్తాడు. వయసునుబట్టి అభ్యుదయ దృక్పథంవుంటుందా? 70ఏళ్ల నెహ్రూ అభ్యుదయవాది కాకుండాపోయ్యాడా? ప్రపంచ విప్లవాదినేతలలో, సోషలిస్టు నాయకులలో యువకులెందరు? వయసు ఎక్కువైనంత మాత్రాన వారు అభివృద్ధి నిరోధకులయ్యారా? అభ్యుదయ భావాలనేవి వయసునుబట్టి వుండవు; వ్యక్తి మనస్తత్వాన్ని బట్టి వుంటుంది. పదహారేళ్ల యువకులలో కూడా ప్రగతిని నిరోధించేవారెంతమంది లేరు? యాభైఏళ్ల యువకులలో వున్న ప్రగతిశీలకత్వం, అరవైఏళ్ల 'ముసలి'ల్లో వుండడానికిలేదా? యువకులు, యువరక్తం అనే బూరగ కేవలం ప్రచారానికి వుపయోగపడేది. యువకులకు ప్రాధాన్యత వుండితీరవలసిందే; కాని అనుభవజ్ఞులైన పెద్దలను త్రోసివేయడం మంచిదేమీకాదు. వయసుకు సమాజంలో గౌరవంవుంటున్నదే కాని, అనాదరణలేదు. యువకులు, వృద్ధులు కలిసిపనిచేసినప్పుడే సత్ఫలితాలుంటాయి. సంజీవరెడ్డిగారికి, రాష్ట్రపతిగా తనను అభ్యర్థిగా నిర్ణయించినప్పుడు, తనవయస్సు కనపడలేదు; ఇప్పుడు కార్యవర్గంలో వుండడానికి మాత్రం ఆయన వయసు అడ్డువచ్చింది! రాష్ట్రపతి ఎన్నిక సమయంలో సిండికేట్ నాయకులు వృద్ధులుగా కనపడలేదు; ఇప్పుడు వీరేంద్రపాటిల్నో, హితేంద్రదేశాయినో కావలసి వచ్చింది! అప్పుడు సిండికేట్ తప్పుచేస్తున్నదనిపించలేదు, ఇప్పుడు తప్పులు దిద్దుకోవడంలేదనే అసంతృప్తి కలిగింది!

రెండు కాంగ్రెస్ సంఘాలను ఏకం చేయుటలో సంప్రదింపులకు పాతవారు పనికిరారట; కొత్తముఖాలు కావాలట. కాంగ్రెస్ సంఘాలను ఏకంచేయుటకు తానుకృషిచేస్తానని సంజీవరెడ్డిగారంటారు. ఆనాడు తనవల్ల సంస్థ చీలిపోయింది సంస్థ ఐక్యతమీద, సంస్థ శ్రేయస్సుమీద తనకంత మమకారంవుంటే, ఆనాడు తన అభ్యర్థిత్వాన్ని వుపసంహరించుకొనివుంటే చీలికే లేదుగదా! ఈసంక్షోభమే లేదుగదా! ప్రీవీ పర్సులు సంబంధించి, సిండికేట్ వ్యతిరేకంగా ఓటుచేసి వుండకూడదట ఈ సంజీవరెడ్డిగారు ఆనాడు ఏమి చేస్తుండినారు? ఆశయాలలో, విధానాలలో తన పార్టీ తప్పుదారిన పోతుంటే, దాన్ని ఆక్షేపించవలసింది, నిరోధించవలసింది అప్పుడా ఇప్పుడా?

మానసికమైన గందరగోళంలోవున్న సంజీవరెడ్డికి ఈ వుచితానుచితాలేమీ కనపడలేదు ఇందిరాగాంధీని హిట్లర్‌కంటే భయంకరమైన నియంతగా (నెల్లూరు సభలోకూడా) చిత్రించిన సంజీవరెడ్డికి ఆనాడు ఇవన్నీ కనపడలేదు. సంజీవరెడ్డి మీద ప్రజలకు ఎంతో గౌరవం వుణ్ణింది; రాష్ట్రపతి ఎన్నికానంతరం ఎంతో సానుభూతి వుణ్ణింది. ఆయన నాయకత్వం పట్ల ఎంతో ఆశ వుణ్ణింది. అవన్నీ పటాపంచలై పోయాయి. సంజీవరెడ్డికూడా సాదా రాజకీయవాది అనే అభిప్రాయం ఏర్పడింది. నష్టేట ముంచిపోయిన పెండెకంటి వెంకట సుబ్బయ్యకంటే ఈయనేమి మేనే అభిప్రాయం ఏర్పడింది ఇక సంజీవరెడ్డిగారు ఆలనాటిబామతోట సేవకానికి తన పూర్తికాలాన్ని వినియోగించుకోవచ్చు!

—మా రా. వ.

---

## హైదరాబాదు లేఖ

(మొదటిపేజీ కొరవ)

తలంపుకాని ఎవరికీ కనిపించలేదు ఇప్పటికైనా అవగాహన గూర్చి బ్రహ్మానందరెడ్డిగారు మాట్లాడుతున్నారంటే తెలుగుప్రజల సమైక్యతావిని అభిలషించేవారంతా సంతోషిస్తారు

ఒకరకంగా ఇప్పటిపరిస్థితి చొక్కారావుగారు చెప్పినట్లు ప్రధాని పూనుకొని తెలంగాణా సమస్యకు శాశ్వతమైన పరిష్కారాన్ని కనగొని అమలుచేయడానికి అన్నివిధాలా అనుకూలంగావుంది.

ఇక్కడి రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా ప్రత్యేకవాదులైనవారిలో ఒకటి రెండు మాసాల్లోగానే ప్రధానమంత్రి కొన్ని నిర్దుష్టమైన చర్యలు తీసుకుంటారనే ఆశావిశ్వాసం కనిపిస్తున్నాయి. ఐతే ప్రధానమంత్రి ఏవైనాచర్యలు తీసుకునేముందు అందరూ అంటే ఈ సమస్యతో సంబంధమున్న వర్గాలన్నీ ఆమెతో సహకరిస్తాయన్న విశ్వాసం ఆమెకు కలగాలి, అప్పటివరకు ఆమె నిరీక్షించవచ్చునని కూడా చొక్కారావు లాంటి మధ్యస్థులు నమ్ముతున్నారు. ఆమెకివిశ్వాసాన్ని ఎవరు కలిగించాలో తెలియదు.

కొంచెం స్థూలంగా చెప్పాలంటే ప్రధాని తీసుకోగలిగినవి, తెలంగాణాతో వేర్పాటువాదాన్ని సన్నగిల్లచేయగలిగేవి, కనీసం ప్రత్యేక రాష్ట్ర వుద్యమ నాయకులు సమ్మతించగలిగేవి రెండే చర్యలు కనిపిస్తున్నాయి: 1. ముఖ్యమంత్రి పదవిలో ఒక తెలంగాణా నాయకుని ప్రతిష్టించడం, 2. తెలంగాణా సత్వరాభివృద్ధికోసం ప్రాంతీయ సంఘానికి తగినన్ని అధికారాలు ఇవ్వడం.

ఈ రెంటిని అంగీకరిస్తే ప్రత్యేక రాష్ట్ర వుద్యమాన్ని కొంతకాలంపాటునిలిపెయ్యాలని ప్రజాసమితి నాయకుల్లో వాదించేవారు పలువురు వున్నారు. వీరిలో కొందరి ఆలోచన ఇలా వుంది: 1 తెలంగాణాకు రాజకీయాధికారం దక్కటకావడాన్ని ఆంధ్ర రాజకీయనాయకులు ఎన్నటికీ అంగీకరించరు (స్వయం బ్రహ్మానందరెడ్డిగారే అందుకు అడ్డుతగులుతారు) 2. తెలంగాణా ప్రాంతీయ సంఘం నిర్ణయాల ననుసరించి తెలంగాణాభ్యున్నతి కనుక జరగాలని కేంద్రం నిర్ణయించడమే జరిగితే, ఆంధ్ర రాజకీయ నాయకత్వమే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణం కావాలని కోర్తారు.

ఇలా ఆలోచించేవాళ్ళకు భిన్నంగా మరికొందరు తెలంగాణా అభ్యున్నతికి నిధులు తగినన్ని లభ్యమయ్యేట్లు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల గ్యారంటీవుంటే సమైక్య రాష్ట్రం విచ్ఛిన్నం కావలసిన అవశ్యకతే లేదని నమ్మేవారుకూడా వున్నారు.

ప్రాంతీయసంఘం అధికారాలను విస్తృతీకరించడం బ్రహ్మానందరెడ్డి గారికి సమ్మతంకాదు. ఇందువల్ల ప్రత్యేకతావాదం బలపడుతుందంటారాయన.

వెనుకబడిన రాయలసీమ ఆర్థికాభివృద్ధికి ప్రత్యేకమైన వ్యవస్థ నేర్పాటుచేసి ప్రత్యేకంగాను అదనంగాను నిధులను కేటాయించడానికి అభ్యంతరం చెప్పని ఆంధ్ర ప్రజాభిప్రాయం తెలంగాణాభ్యున్నతికి ప్రత్యేక ఏర్పాటు జరగడానికి మాత్రం అభ్యంతరం తెలుపుతారా? ఎవరొప్పీ ఆంధ్ర కాంగ్రెసు నాయకులు ఎల్లాపవ రిస్తారనేది సమస్య ఆంధ్ర కాంగ్రెసువాదులకు స్వంత అభిప్రాయమంటూవుండదు. ఉన్నా దాన్ని ప్రకటించి అమలు కావాలనే దీక్షసైర్యం లేకుండాపోయి చాలాకాలమైంది ఆంధ్రలో కాంగ్రెసంటే దాను బ్రహ్మానందరెడ్డిగారు. బ్రహ్మానందరెడ్డిగారంటే కాంగ్రెసు.

ఈ విధంగా ఎలాచూసినా తెలుగుదేశ భవితవ్యమంతా ఒకేవొక వ్యక్తిపై ఆధారపడి వుందంటే అతిశయోక్తికాదు

---

## జనవాణి

(2వ పేజీ కొరవ)

### మన మంత్రిగారి సోషలిస్టు పెండ్లి

ఇటీవల జరిగిన మన మంత్రి శ్రీ ఆనం సంజీవరెడ్డిగారి కుమార్తెల పెండ్లిండ్లు ఎంత వైభవంగా చేశాడో ప్రతివొక్కరికి తెల్సిందే. దాన్నిగూర్చి మీరు కాగితంతో పాటు కాలంకూడా వృథాచేశారనిపిస్తుంది. ఎందుకంటే ప్రతివొక్కరికి తెలిసిన విషయాన్ని అంత ఎక్కువగా చిత్రించి చాలా శ్రమపడ్డారు

ప్రస్తుతం ప్రతినాయకునికీ సోషలిజం అనేమాట నాలుకమీద వుండేదే. సోషలిజాన్ని గూర్చి ఎన్నిపేజీలైనాఎక్కి వుపన్యసించ గలుగుతున్నాడు. అట్లాగే శ్రీ ఆనం సంజీవరెడ్డి మొన్నటి ఎలక్షన్లలో ఎన్ని వేదికలమీద సోషలిజంగూర్చి ఎన్ని పర్యాయాలు వుద్ఘాటించాడోగదా! ఇంకా ఎన్నిసార్లు వుపన్యసిస్తాడోగదా! కాని తనదాకా వచ్చేటప్పటికి నూటికి వదిపాళ్ళుకూడా ఆచరణలో పెట్టలేకపోయాడు.

20 ఎకరాల స్థలాన్ని రాత్రింపగలు చేసినాడని వ్రాసినమీద దానికై ఎంత ఖర్చు పెట్టిండీ, ఆ అడంబరాట్టహాసం అపారంల్లో కల్పించిన వెగటునుగూర్చి మీరు అంగం చలేదు ఆయన పలుకుబడి హోదా ప్రతివొక్కరికి తెలిసినదే. మంత్రి మాత్రం చేయగూడదా- అనవచ్చు. కాని దానికి వొక హద్దు వుండనక్కర్లేదా? సోషలిజాన్ని చేతలలో చూపించివుంటే చాలా అనవసరపుఖర్చు తగ్గివుండేది. అయితే వొకమాట ఆయన సోషలిజాన్ని చూపింది పెండ్లి ఆహ్వానపత్రికల్లో మాత్రమే అవిమాత్రం చాలా సింపిల్‌గా వుండినాయి.

నెల్లూరు —పాలిచర్ల ఆదిశేషారెడ్డి

---

## ఈ వారం విశేషాలు

(2వ పేజీకొరవ)

దురాక్రమణను అప్రమత్తంగానే ఎదుర్కొంటూ పాక్ ఆక్రమణ సైనికులను వెనుకకు పారద్రోలుతున్నారుట

త్రిపురదగ్గర ఇద్దరు ఢిల్లీ జర్నలిస్టులు దీపక్ బెనర్జీ, సురజిత్ ఘోషాల్‌లను పాక్ సైన్యాలు బలవంతంగా పట్టుకుని కొమిల్లాకు తీసుకవెళ్ళారంటే మన సరిహద్దు ప్రాంతంలో పాక్ సైన్యాలు ఏవిధంగా వీరవిహారం చేస్తున్నాయో గమనించవచ్చు. ఈ విషయమై పార్లమెంటులో చర్చకొచ్చినప్పుడు రక్షణ మంత్రి స్వరణ్‌సింగ్ భారత ప్రభుత్వం పాకిస్తానుకు నిరసన తెలియచేస్తూ వొకపత్రం పంపించన్నారు. నిరసనలేఖలతో పాకిస్తానుకు జ్ఞానోదయమవుతుందా మన ప్రభుత్వం పిచ్చిగాని బంగ్లాదేశ్ నుంచి వస్తున్న లక్షలాది శరణార్థుల సమస్యవొకవైపు, పెచ్చుమీరుతున్న పాక్ కవ్వింపుచర్యలు మరొకవైపు వీటితో మనం సతమతం కావాల్సిందేనా?

### 60 లక్షల చోరీ

ఢిల్లీ స్టేట్ బ్యాంకులో 60 లక్షల చోరీ వుదంతం దిగ్భ్రాంతి దిగ్భ్రాంతంగా వుంది. బంగ్లాదేశ్‌కు సంబంధించి సహాయం చేసేందుకు రహస్యంగా 60 లక్షల రూపాయలు కావాలని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఫోనులో రహస్యవర్తమానం పంపినట్లు, అందుమీదట బ్యాంకి అధికారి 60 లక్షల డబ్బు తీసుకుని ఫోనులో చెప్పిన నిర్ణీత ప్రాంతంలోవున్న వొకమాజీ సైనిక కెప్టెన్ నగర్ వాలాకు అందజేసినట్లు, వోచర్ అడిగితే ప్రధాని ఇంటికి కారులో బయలుదేరి వస్తే తనూ అక్కడికొచ్చి ఓచర్ ఇప్పించగలనని చెప్పినమీదట ఆ బ్యాంకు అధికారి అక్కడికెళ్ళి ఎంతసేపు కాచుక్కూచున్నా అతను అందుకోనట్లు, దానిమీదట ఇందులో ఏదో మోసం జరిగిందని తెల్సుకుని పోలీస్ రిపోర్టు ఇవ్వడంతో ఢిల్లీ పోలీసు కదలి ఎట్లనో ఆ నగర్‌వాలాను వెంటనే వెతికి పట్టుకుని 3 వేలు తక్కువ 60లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు - ఈ చోరీ కేసుకు సంబంధించిన ప్రధాన వివరాలుగా చెప్పుకుంటున్నాయి నిజానికిందులో ఏదో కుంభకోణం జరిగిందనుకున్నా- ఏదో ప్రభుత్వ రహస్య కార్యకలాపాలకని ప్రధానమంత్రి దగ్గరనుండి ఫోన్ వచ్చినంతమాత్రాన బ్యాంకు అధికారులు ఈ వుదంతంలోలాగ డబ్బు పట్టుకెళ్ళి ఇచ్చే ఆచారంవుందా? గతంలో ఫోనుపిలుపు ఆధారాల్నిబట్టి ప్రధాన మంత్రికి ఇట్లా కొన్ని మొత్తాలను అందజేసి వున్నారా బ్యాంకువారు? -అనేవి పరిశీలించాల్సిన అంశాలు. పార్లమెంటులో ఈ విషయమై పెద్ద రచ్చ జరిగింది. నగర్‌వాలాకు నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. చూద్దాం ఏమవుతుందో.

---


# నేషనల్ సీడ్సు కార్పొరేషన్ లిమిటెడ్

(భారతప్రభుత్వ యాజమాన్య సంస్థ)

మేము ఈ క్రింది శ్రేష్ఠమైన విత్తనాలను లభ్యంచేస్తున్నాము.

హైబ్రిడ్ సజ్జ నెం. H-B 1, మరియు H B-4

హైబ్రిడ్ మొక్కజొన్న గంగా-5

—: కూరగాయల విత్తనములు :—

వంగ, టొమాటో, సొర, కాకర, పూసా సావానిబెండ

కావలసినవారు మావద్దగాని లేక మా అనుమతిపొందిన ఈక్రింది డీలర్లవద్దగాని మాచే నిర్ణయించబడిన ధరలకు పొందవచ్చును.

1. ఆంధ్ర రైతుడిపో; మిట్టపాళెం-గూడూరు.
2. M/S. డి.సి.వి. కృష్ణమూర్తి & కో., నాయుడుపేట
3. M/S. చందు ఏజన్సీస్-నవాబుపేట-నెల్లూరు2

గమనిక: "సంకరసజ్జ నంబరు-1 విత్తనములకు గుడ్డనంచులు స్టాకు లేనందున HB-1 గుడ్డసంచులను HB-4 అనువిధముగా మార్చియున్నాము. కావున రైతులందరూ ఇది గమనించి సీలుపురంగుటాగుమీద, లేబిలుమీద HB-4 నంబరుచూచి, సీలుచూచి కొనవలసినది".

— వివరములకు —

నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్

(ఏ. సి. సుబ్బారెడ్డి కో-ఆపరేటివ్ మిల్ ఆవరణం)

నవాబుపేట (ఫోన్ 473 పి. పి.) నెల్లూరు-2

జాగ్రత్త: కృత్రిమమైన, నిరాకరించబడిన విత్తనాలు తక్కువధరకు మార్కెట్టులో లభించవచ్చు. అటువంటి విత్తనాలను వుపయోగించినయెడల దిగుబడి దెబ్బతింటుంది.

## ఇండ్లప్లాటులు

నెల్లూరుటవున్ మూలపేట లో జిల్లాజడ్జిగారి బంగళా స్థలంలో శ్రీ ఆక్కవరపు రామిరెడ్డిగారి యింటికి ఎదురువైపు) షుమారు 178 అంకణములు కాళీస్థలము అమ్మబడును. మొత్తముగాగాని,బిట్లుగాగాని అమ్మబడును. కింద పొంతరాతి దట్టు, మంచినీరు పైనే దొరకును. స్థలమునకు దక్షిణపు తూర్పు వీథులు పడమట జడ్జిబంగళా కాంపౌండు గోడ Lay out ప్రకారం తూర్పు పార్కు యుండును. వలయువారు-

**శ్రీ యం. సుందరాచారి,**
అడ్వకేటు,
16/1928, శ్రీనివాస అగ్రహారం,
నెల్లూరు,
తో సంప్రదించవచ్చును.

### కోవూరు డి॥ ము॥ కోర్టులో

E. P. 25 of 70 KOS 247 of 59

కొండా సీతమ్మ —డి. హో.(వాది)

నెల్లూరు కమలాక్షమ్మ వగైరా —ప్రతివాదులు.

ప్రతివాదులతాలూకు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పైకోర్టులో 7-6-71 తేదీ వేలము జరుపబడును.

— షెడ్యూలు —

నెల్లూరు రి. డి యిలాకా అల్లూరు స. రి. లో చేరిన కోవూరు తాలూకా నార్తు మోపూరుగ్రామంలో:

| పట్టా నెం. | సర్వే నెం. | విస్తీర్ణం |
|---|---|---|
| 89 | 56ఎ | య 0-87 ట్లు |
| ,, | 56బి | 0 84 ట్లు |
| ,, | 56సి | 0-72 ట్లు |
| ,, | 57ఎ | 0-77 ట్లు |
| ,, | 57బి | 0-96 ట్లు |
| | కల్లు | య 3-86 ట్లు |

1-482 హెక్టార్ల మాగాణి భూమి. వాది క్రయం రూ. 12000, అమీనా క్రయం రూ. 15000 లు.

— కలికి కోదండరామరెడ్డి,
వాది అడ్వకేటు.

### రాజమండ్రి సబ్ కోర్టులో

O. S. 315 of 1970

సంగుల ధర్మరాజు —వాది.

మేడేపల్లి సత్యనారాయణమ్మ సా॥ నంది పూడి, రామచంద్రపురం D. M. C. —6 వ ప్రతివాది.

ఈనెంబరులో వాది 6వప్రతివాది పైనిన్ని సంగిశెట్టి పెదకాపు అనే సుబ్బారావు వగైరాల పైనిన్ని,వాదిపేర 20-7-1966తేదీన వ్రాయించియిచ్చిన రి జి స్ట రీ అస్వాధీనపు తనఖాదస్తావేజుప్రకారం రావలసినఅసలు సాయిదాలు బాకీ రూ. 8600-లకు న్ను దావాఖర్చులు దర్మిలావడ్డీకిన్నిదావాచేయగా 6 ప్రతివాది ఎన్నిపర్యాయములు సమనులు చేయించినప్పటికీ పుచ్చుకోకుండా Avade చేయుచున్నందున 24-6-71 తేదీ పగలు 11 గంటలకు పైకోర్టువారిఎదుట హాజరై ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనిఎడల ఆమె పరోక్షమందు దావా తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

—యం. నాగభూషణరావు,
ప్లెయింటిప్ అడ్వకేటు.

## పసిరికలు-
## -కామెర్లు

**భయపడపనిలేదు**

**డాక్టర్ సి. రామయ్యంగార్**
రంగనాయకులపేట – నెల్లూరు.

# అప్పుడు ఇండియా మూడు ముక్కలవుతుందన్నారు; ఆఖరుకు ఇప్పుడు జరగబోయేది అంతేగదా!

ఆర్థికంగా– సాంఘికంగా తూర్పు పాకిస్తాన్ ఒక వలసదేశ మెలా ఆయిపోయిందో– పాకిస్తాన్ అంటే పశ్చిమ పంజాబు పాత జమీందార్లు, భూస్వాములు– సంపన్నుల జేబు రాజ్యమెలా అయిందో– తూర్పు పాకిస్తాన్‌లో క్రమేపీ వుద్యోగాలూ, ఇతర సదుపాయాలే కాకుండా– భూమి– ఫ్యాక్టరీలు– ఉత్పత్తి సాధనాలలో అధికభాగం పంజాబీలు ఎలా స్వాధీనం చేసుకున్నారో వివరించి– "పాకిస్తాన్ వలస యజమానులకు వ్యతిరేకంగా మహావిప్లవం జరుగుతూంది" అన్నాడు దత్తా. ఆమాటతో విప్లవానికి- తిరుగుబాటుకు వున్న తేడాపై చాలా విషయపూర్ణమైన చర్చ సాగింది. "విప్లవం అనేది సమాజంలో అధిక సంఖ్యాక ప్రజలు పాల్గొనేది- తిరుగుబాటు అనేది వర్గపోరాటాలలాగ అల్ప సంఖ్యాకులు చేసేది" అని ప్రొఫెసర్ నిర్వచించారు. "ఆ లెక్కలో చాలా విప్లవాలు విప్లవాలు కాదన్నమాట. ఫ్రెంచి, రష్యన్, అమెరికన్- తుదకు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంకూడా విప్లవం కానేరదు"- అన్నాడు ఒక విలేఖరి.

"నిజం మాట్లాడవలసివస్తే అంతే. కృతనిశ్చితమైన- క్రూరంగా పోరాడ గలిగిన అల్పసంఖ్యాకుల తిరుగుబాట్లు ప్రభుత్వాలను కూల్చడం- అధికారానికి రావడం ఆశ్చర్యంలేదు. చరిత్రంతా అట్టి సంఘటనలతో నిండివుంది. బంగ్లాదేశ్ పోరాటం చూడండి- మొత్తం తూర్పు పాకిస్తాన్ ప్రభుత్వ యంత్రం- ప్రభుత్వ శాఖలన్నీ ప్రజలతో కలిసిపొయ్యాయి. పోలీసు, బెంగాలు రైఫుల్సు, ముజాహిద్స్, యస్. సి. సి. తో సహా ప్రజలతో కలిసిపొయ్యాయి. బెంగాలువారుగా యీపోరాటాన్ని ప్రతిఘటించే వర్గమే కనుపించదు. కావున ఇది మహావిప్లవం కాదంటారా? దీని ఫలితం- రూపం ఏమికానుంది అనేది వేరేప్రశ్న. ఇది మహా విప్లవంగా ప్రారంభమైంది" అన్నాడాయన. "కాని యీ జాతీయ వుద్యమం పైకిలేపిన మేధావి నాయకత్వాన్ని పనిగట్టుకుని పాకిస్తాన్ చంపివేస్తుంది. యీ వుద్యమంలో నిజానికి ప్రజాస్వామ్య భాగం వీరే వారిని శారీరకంగా తుడిచివెయ్యడంద్వారా- యీ పోరాటాన్ని మావ్ సెటూంగ్ వర్గానికి అప్పగించడం అవుతుంది" అన్నాడాయన.

నక్సలైట్ల హత్యాకాండ బెంగాలులో అతి అవుతూనే వుంది. కాని దానిని ఇప్పుడంతగా పట్టించుకోనట్లు ఎవరు ఐట్టినా బంగ్లాదేశ్ కథలే మాట్లాడుతారు. కలకత్తాలో కొన్నివీధులకు పోలీసులు వెళ్ళాల్సిందేకాని- జనం వెళ్ళరు. అవి నక్సలైట్ల కేంద్రాలట. బంగ్లాదేశంనుండి రాకపోకలు జరగడానికి ఏ అభ్యంతరం లేదుకావున- అచ్చటనుండి అన్నిరకాలరాజకీయవాదులూ కలకత్తాచేరుకుని- వారికిగతంలోసంబంధం వున్న అన్నిపార్టీలతో సంబంధం పెట్టుకుంటున్నారు. నక్సలైట్ల నాయకుడు మహమ్మద్ తోహా తరచు కలకత్తాలో కనుపిస్తున్నాడు. చైనా అనుకూలురైన భషానీ నేషనల్ అవామీపార్టీ కలకత్తాలో ఎచ్చటో ఒక ఆఫీసుతీసుకుని పనిచేస్తున్నదట. మితవాద అతివాద కమ్యూనిస్టులు వారి పాతసంబంధాలను పునరుద్ధరించి బంగ్లాదేశ్‌గొడవలో మరుకైన విధానం అవలంభిస్తున్నారు. ప్రజాసోషలిస్టులు, ఫార్వర్డు బ్లాక్- కలకత్తాలో అన్ని అంతర్జాతీయ పార్టీలకు శాఖలున్నట్లున్నాయి- అంతా తమవంతు పనిలో నిమగ్నమైనారు.

మరునాడు మేము మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీవారిని కలుసుకున్నాము. "ఇది బూర్జువా రెవల్యూషన్. కార్మిక వర్గ పోరాటం మాత్రం కాదు. కాని దీని పరిణామం కార్మిక వర్గ విజయానికి దారి తీస్తుంది" అని వారినిర్వచనం. ముజిబూర్ రహమాన్ కమ్యూనిస్టు వ్యతిరేకి అని- వాస్తవిక శ్రామికవర్గ విప్లవం రాకుండా అరికట్టడం- పశ్చిమ పాకిస్తాన్ గుత్త పెట్టుబడిదార్ల పట్టును తూర్పు బెంగాలుపై సడలించి- జాతీయ బూర్జువా అభివృద్ధికి చేయూతనివ్వడం రహమాన్ కార్యక్రమం అని ఈ పోరాట ఆర్థికస్వరూపంపై అతివాద కమ్యూనిస్టులనిర్వచనం. వారు భషానీనికి- మరికొందరు కార్మికసంఘ నాయకులతోనే కాకుండా- ఒక రహస్య కమ్యూనిస్టు వర్గంతో నిత్యసంబంధంలోవున్నట్లు-గూకు అనేకవిషయాలలోతోడ్పడిన ఢక్కా పత్రికాధిపతి చెప్పాడు. ఢక్కాలో రహమాన్ పార్టీ దినపత్రికను- విద్యార్థుల వారపత్రికను- ప్రచురణాలయాలను మిషన్ గన్నులతో కాల్చి బూడిదచేసింది పాకిస్తాన్ సైన్యం. ఈ ఘోరకలిని అరికట్టడానికి ప్రయత్నించిన విద్యార్థులు, విలేఖరులు, ప్రెస్‌వర్కర్లు కనీసం రెండు ఆఫీసులతోపాటు ఆరువందల మంది ధ్వంసమయినారు. కాలిపోయిన కార్యాలయాల బూడిదలో ఎచ్చటచూచినా ఎముకలు- పగిలిపోయిన తలలూ కనుపించినాయని ఢక్కా పత్రికాధిపతి అహ్మద్ అష్రాఫ్ మాతో అన్నారు. ఇతడు ఢక్కా నుండి పారిపోయివచ్చి కలకత్తాలో వుంటున్నాడు.

ఇతడేమిటి ఇట్టి పరిజ్ఞానమయంలో ప్రతిఘటన సాగిస్తున్న ప్రజలతో వుండవలసిన ఎందరో కలకత్తాలో కనిపిస్తారు. బంగ్లాదేశ పరిస్థితి ఇంతదూరం వస్తుందని వూహించని రహమాన్ పార్టీ- సాయుధ ప్రతిఘటనకు ఎప్పుడూ సిద్ధంగా లేదట- నిజానికి ఆ పార్టీ స్వరూపమే దానికి సరిపోదు అని జస్సూరు కాలేజి లెక్చరర్ అన్నాడు. నిజానికి పోరాటం ప్రారంభమైన మొదటి వారంలోనే రహమాన్- ఆయన అనుచరులైన పార్లమెంటుసభ్యులు- శాసనసభ్యులు రెండువందల మందికి పైగా అరెస్టుకావడమో- ఇండియాకు తప్పించుకొని రావడమో జరిగింది కొద్దిమంది మాత్రమే దేశంలో వున్నారు. వారూ- బెంగాల్ రైఫుల్సు, పోలీసు, మాజీ సైనికులు, తదితరులు కలిసి ప్రతిఘటన సాగిస్తున్నారు. ప్రజలేమి చెయ్యగలరు? పాకిస్తాన్ కిరాతక సైన్యం ఆధునిక మారణఆయుధాలతో ఆకాశంనుండి,భూమినుండి, నీటినుండి మృత్యువర్షం కురిపిస్తున్నప్పుడు చనిపోవడమో- సాహసంతో ఎదిరించి పోరాడడమో తప్ప గత్యంతరంలేదు ఇట్టి భయంకర పీడ దృశ్యంనుండి ప్రజా ప్రతిఘటన ప్రారంభమైంది.

భారతదేశంలో వున్న రాజకీయ వైరుధ్యాలన్నీ బంగ్లాదేశంలో లేకపోలేదు. కాని పాకిస్తాన్ సైనిక క్రౌర్యం అందరినీ ఏకంచేసింది. ఈ కారణాలవల్లనే మిగిలిపోయిన రహమాన్‌పార్టీ, పిల్లకమ్యూనిస్టు నాయకులైన సోలాన్ భషానీ, మహమ్మద్ తోహా, నూరుల్ ఖాదరు మొదలైనవారితో రహస్య సంప్రదింపులు సాగించి, విముక్తసేనలో ఇముడ్చుకున్నారు. లక్షమందికి పైగా యువకులను గొరిల్లాసైన్యంలో చేర్చుకొనడం- దళాలుగావిభజించి నెంతరిపీడు ఇవ్వడం కార్యక్రమంగా పెట్టుకుని పని చేస్తున్నారు. రహమాన్ రంగంనుండి అదృశ్యమైతే- ప్రతిఘటనోద్యమం కమ్యూనిస్టుల చేతులలో పడుతుంది కావున- జాతీయ మహావిప్లవంగా పైకులేచిన యీ పోరాటాన్ని- వర్గ తిరుగుబాటుగా చిత్రించి, ఛిద్రించి అణచివెయ్యడం తెలివైన పాకిస్తాన్ సైనిక నియంతల వూహలా వుంది. కానిఇంతవరకు అది విఫలమైంది. మాకు తెలిసిన సమాచారాన్ని బట్టి పాకిస్తాన్‌నుండి విముక్తి చెందనంతవరకూ ఆ పరిస్థితి రాకపోవచ్చును యీ పోరాటాన్ని వర్గపోరాటంగా మార్చితే వచ్చే ప్రమాదం కమ్యూనిస్టులకు తెలుసు. వారనుకున్నది సాధించాలన్నా- పాకిస్తాన్ పెత్తనం ధ్వంసంకావాలి. కాబట్టి పాకిస్తాన్ వూహలు నెరవేరకపోవచ్చు అవామీ

## బాంగ్లాదేశ్
### (ఆఖరు వ్యాసం)

**శ్రీ జి. సి. కొండయ్య**

* * * * * *

లీగ్‌లో రెండువర్గాలు, అత్తర్ రహమాన్ పార్టీ బెంగాల్ నేషనల్‌లీగ్, ప్రొఫెసర్ ముజాఫర్ అహమ్మద్ అతివాద సోషలిస్టు లీగ్- మొదలైన పార్టీల అగ్రనాయకులు కార్యాచరణ కమిటీలో రహస్యంగా పని చేస్తున్నారు. దీనితో ప్రతిఘటనోద్యమానికి ప్రజాపునాది- ముఖ్యంగా గ్రామాలలో- అగ్గనైజేషన్- క్రమశిక్షణ ఏర్పడింది.

కాని వున్న దిక్కంతా ఆయుధాల సేకరణ ఎట్లాగనేదే 20 వేల 303 రైఫుల్సు విముక్తదళాలకు వున్నాయి. వాటికయినా తగిన గుండ్ల సరఫరాలేదు "అతి కీలకమైన రెండుచోట్ల గుండ్లు అయిపోయి మేము తిరోగమించడం-పాకిస్తాన్‌సైన్యం పురోగమించడం జరిగింది" అని ప్రసిద్ధ విప్లవ నాయకుడు మోనీసింగ్‌మాతో అన్నాడు. ఇతడి వయస్సు 82 సంవత్సరాలు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన విప్లవ యోధుడు. చిటగాంగ్‌లో నివసించేవాడు. ఇప్పుడు ఒక కీలకప్రాంతంలో విముక్తదళానికి కమాండర్‌గా వున్నారు. ఇతడు హిందువు కావున పాకిస్తాన్‌రేడియో పేరుపెట్టి- ఈ ద్రోహిని మహమ్మదీయులు చంపివెయ్యాలని తరచు ప్రసారం చేసిందట. పోరాట ప్రారంభంలో పాకిస్తాన్ సైనిక మకాంలను స్వాధీనం చేసుకున్నప్పుడు దొరికిన మెషిన్‌గన్నులూ మోర్టారులులాంటివి కొన్నివున్నా - యుద్ధవిమానాలు- ట్యాంకులు, చైనా రికలాయన్ తుపాకులువుండి - మారణహోమ కార్యక్రమంలో తరిఫీదయిన సైన్యంతో పోరాట! సాహసం, మానవత్వం- అది ప్రేరేపించిన దేశభక్తి- అది ఉత్తేజపరచిన ధైర్యసాహసాలు-స్వాతంత్ర్యంకొరకు బలికాను నిర్భయమైన నిండు గుండెలు వారికున్నాయి. ఇదేమిటేం రాక్షస, దురాక్రమణ, ఉన్మాదులైన సైన్యం పాకిస్తాన్‌ది. భూ భాగం కొత్తది. ప్రజలు పలకరు. దార్లు తెలియవు. చాలకష్టం. అందుకనే ఆకాశాన్నుండి-భూమినుండి బాంబులు- ఫిరంగులు- నిప్పులవర్షం కురిపిస్తారు. బంగ్లాదేశ్ అంతరంగిక మంత్రి ఎ. హెచ్. కమరుజ్‌మాన్ లెక్కలప్రకారం 22 లక్షల మంది ప్రజలు-10 వేల మంది పాకిస్తాన్ సైన్యం చనిపోయారు." ఎన్ని లక్షల ఇండ్లు, భవనాలు ధ్వంసం అయిపోయినా- ఎంతమంది స్త్రీలు చెరబడ్డారో! ఘోరం. కాని బెంగాలుజాతి కసి తీర్చుకుంటుంది" అన్నారు ఆవేశంతో అంతరంగికమంత్రి. "ఆయుధాలు! మాకు ఆయుధాలుకావాలి. మిగిలినపని మేము చేస్తాం. కాని ఎల్లా వస్తాయి! కొన్ని ట్రెజరీలలోవుండిన 2½ కోటి రూపాయలు అధికార్లు మాకిచ్చారు. దానితో ఎన్ని ఆయుధాలు వస్తాయి? వందలకొలదికోట్లధనాన్ని బ్యాంకులనుండి సైన్యం దోచుకుంది. ప్రజల ఇండ్లలో దొరికిన బంగారు, ధనం-సర్వం దోచుకెళ్ళారు. అని కోపంతో వుబ్బిపోయిన కండ్లు నీరు చిమ్ముతూండగాఅన్నారు'కమరుజమాన్'. కాని ఇంకేమి తీసుకెళ్లగలరు! మాతృత్వం మిగిలాయి. వాటిని తీసుకెళ్లలేరు. బూడిద చేసిపోవలసిందే" అన్నారు.

మరో గొరిల్లా వ్యూహ నాయకుడు "ప్రకృతి మాకు రక్షకుని వంపుతుంది. జూన్‌నాటికిబంగ్లాదేశంలో 200 అంగుళాల వర్షం పడుతుంది. వగ బెంగాలు నీటిలో వుంటుంది. తేల్చుతాము పాకిస్తాన్ మృత్యువు జనానులకథ" అన్నాడు. పాపం వారినమ్మకాలవి. ఎందుకని ఏదేశమూ మమ్ముల గుర్తించదే? తుదకు ఇండియాకూడా గుర్తించదే అనేది బంగ్లా పోరాటకుల నాలుకపై వున్నమాట ఎవరి దేశ ప్రయోజనాలు వారు చూచుకుంటారు. దానికయినా గుర్తింపు ప్రజలిచ్చే ప్రయోజనంలేదు ప్రభుత్వాలివ్వాలి అంత సులువంటారా? పాకిస్తాన్‌కు అన్ని అగ్రరాజ్యాలు స్నేహితులు. పోతే చైనా బెదిరింపు వుండనేవుంది. మిక్కు తోవ్వడక పోగా-ఇండియా గుర్తింపు చైనా-ఇండియా యుద్ధంగా తయారయితే-మిగతేమవుతుంది అనేరకంగా మాలోఒకరు వాదించారు.

"చైనా నిన్నటిదాకా అంతర్‌యుద్ధాలను ప్రోత్సహించి-తీరా అది వచ్చిన తర్వాత పాకిస్తాన్‌తో చేరిందేమిటి? అని మరొకరు వారి జాఫర్‌మేషన్ ఆఫీసరుతోఅన్నారు. అతను చైనానుఖండించలేదు. "చూద్దాం పోరాటం ఆపే ప్రశ్న లేదు. సరిగదా-ఇదో దీర్ఘకాలపోరాటంగా వుంటుంది. అప్పుడుచూద్దాం చైనా వ్యవహారం. దానితో మాకెందుకు? మేము జయిస్తే అంతా గుర్తిస్తారు" అనేవాడా యువకుడు. "కాని వియత్‌నామ్‌కు చైనా రష్యాల మద్దతుంది. అక్కాంటిదేమీ లేకుండా–" అన్నానునేను. "రష్యన్ విప్లవకారులకు ఎవరి తోడ్పాటు వుండిందండి? లేకపోగా అన్నిదేశాలూ జారు చక్రవర్తినే సమర్థించాయికదా? అయినా విప్లవం జయించింది" అన్నాడతడు. ఇదో దీర్ఘ పోరాటంగా సాగుతూందనేది నిర్వివాదాంశం. 1964 లో సైగాన్‌ను దర్శించిన నాకు ఒక విషయం కనువిప్పయింది సైగాన్‌కు మూడుమైళ్లదూరాన దక్షిణవియత్‌నాం ప్రభుత్వం పనిచెయ్యదు. పగలు విప్లవకారులది సైగాన్ పాలకులదిగా వడకొండే ల్లు సాగింది బంగ్లాదేశం అంతకన్నాతక్కువేమీకాదు పట్టణాలు పాకిస్తాన్ సైన్యంచేతులలో వుండవచ్చు పల్లెలు గొరిల్లాల రాజ్యంగా వుంటాయి. ఇదితప్పదేమో ననిపిస్తుంది. పాకిస్తాన్ పెత్తనం ఇక పాతరూపంలో వుండదు అందుకనే బంగ్లాదేశాన్ని మూడుగాచీల్చి స్థానిక ద్రోహులు దొరికితే వారి స్వపరిపాలనగా మార్చి ప్రజలలో చీలిక తీసుకురాను ప్రయత్నం జరుగుతూంది. ప్రజావెల్లువకు భయపడి నోరుమెదపకుండావుండిన ముస్లిం లీగర్లు- మతోన్మాదులు పాకిస్తాన్ సైన్యానికి ఏజంట్లుగా తయారవుతున్నారు. కాని ఇప్పుడు వారిపని సాధ్యంకాదు. అన్ని అతివాదపార్టీలూ పోరాటంలో ప్రవేశించడంతో

—కొంవ 7 వ పేజీలో

# కొత్తకొత్త రకాలు-

## కో గుమ్మడి, లూధియానా పుచ్చ-

## టొమేటో, చేదులేని కాకర

### కొబ్బరిపీచు లాభాలు

కొబ్బరి తోటలలో పనికిరాని కొబ్బరి పీచును పాతిపెడితే వాటినుండి కొబ్బరి చెట్లు సులభంగా పీల్చుకోగలిగిన రూపంలో పొటాష్ లభిస్తుంది; ఆ నేలలోని తేమను పీచు నిలవచేస్తుంది.

కొబ్బరిపీచులో 15 శాతం పొటాషుంది. ఇది తన బరువుకు ఆరురెట్లు నీటిని పీల్చు కుంటుంది. దీని పొలం (తోట) తవ్వడా నికికూడా వాడవచ్చును.

కొబ్బరిచెట్ల వరుసలమధ్య 18 సెం. మీ. వెడల్పు 45 సె మీ. లోతుగల గోతులు చేసి, వాటిల్లో కొబ్బరిపీచును, మూడుపొర లుగా, బోర్లించినట్లు అమర్చాలి. ఒక్కొక్క పీచుపొరమీద సన్నగా వట్టిపోయాలి. అన్నిటికన్న పైనవున్నపొర నేలమట్టానికి 23 సెం. మీ. లు దిగువనుండాలి.

కొబ్బరిచెట్ల చుట్టూర గొయ్యితవ్వి ఎరు వులువేసే పద్ధతిలో, ఈ గోతిని 30 సెం. మీ. లోతున, కొబ్బరిపీచును ఒకేపొరగా వెల్లకిల వుంచాలి దీనిమీద ఎరువులు, రసా యన ఎరువులు కలిసిన మట్టిని పోయాలి.

కొబ్బరిపీచు బూడిదలో 20 25 శాతం దాక పొటాషువుంటుంది. కొబ్బరిచెట్లకు అమ్మోనియం ఎరువులను వేయడానికొక పక్షం ముందుగా ఈ బూడిదను వేయ వచ్చును

### కో 1 గుమ్మడి

కోయంబత్తూరు వ్యవసాయ కళాశాల పరిశోధనాసంస్థవారు సృష్టించిన 'కో-1' రకం గుమ్మడి హెక్టేరుకు 28,000 కిలోల గుమ్మడికాయలనిస్తుంది.

విత్తనాలు చల్లేటప్పుడే ఒక్కొక్క పాదుకు 25 కిలోల పశువులపెంటను, 100 గ్రాముల (6: 12: 12) రసాయన ఎరువుల మిశ్రమాన్నివేసి, ఆ తర్వాత 50 గ్రాముల అమ్మోనియం సల్ఫేటువేసి పై పాటు చేయగా సత్ఫలితాలు లభించాయి. కో-1 గుమ్మడి నిజాజాలలోగాని, దిసెంబ రులోగాని విత్తవచ్చును. విత్తిన 115 రోజు లకు కాయలు కోతకు సిద్ధమవుతాయి. 60 రోజులపాటు కాయలు లభిస్తాయి.

### యూరియా పిచికారీద్వారా అధికవరి దిగుబడి

యూరియా ఎరువును పైరుపై పిచికారి చేయడంవలన వర్షాధారపు వరిపైరునుండి కూడా హెక్టేరుకు 2 6 క్వింటాళ్ల దొడ్డువ అధికదిగుబడి సాధించవచ్చును. తద్వారా



యూరియా ఖర్చు, పిచికారీఖర్చుపోగా అద నంగా హెక్టేరుకు రు. 115 లు లాభం వస్తుంది.

ఇటీవల బిలాస్‌పూర్ (మధ్యప్రదేశ్) జిల్లాలో 4800 హెక్టేర్ల వరిపైరుమీద విమానాలద్వారా యూరియా పిచికారీ చేయగా పై ఫలితాలు లభించాయి.

వరిపైరు 55-60 రోజుల వయసున పుడగా హెక్టేరుకు 89 లీటర్ల 20 శాతం యూరియా (8 కిలోల నతజని నివ్వడానికి 17 8 కి లో యూరియా) ద్రావణాన్ని చల్లారు.

### కార్బరిల్‌తో - కొబ్బరితోటకు రక్షణ

కొబ్బరితోటకు అమితనష్టం కలుగ చేసే ఎర్రపప్పి పురుగును కార్బరిల్‌తో నాశనం చేయవచ్చునని కాయంగుళం (కేరళ)లోని కొబ్బరి పరిశోధనానిలయం వారు తెలుపుతున్నారు. కార్బరిల్ మందును కొబ్బరిచెట్టు చుట్టూ మూడు నాలుగు చోట్ల "ఇంజెక్ట్" చేయాలి (ప్రవేశపెట్టాలి) ఇట్లాంటి "ఇంజెక్షన్" ఒక్కొక్కదానికి 30-40 పైసలు ఖర్చవు తుంది.

1000-1500 సి. సి ల నీటిలో 20-30 గ్రాముల (నీటిలో కరుగదగిన, 50శాతపు) కార్బరిల్ మందును కలిపితే ఒక చెట్టు చుట్టూ ఇంజెక్ట్ చేయడానికి సరిపోతుంది.

కార్బరిల్ మనుష్యులకు విషమూ కాదు; కొబ్బరిచెట్లకు దానివలన హాని కలుగదు.

### క్రొత్త పుచ్చరకం

"ఇంప్రూవ్డ్ షిప్పర్" అన్న సరికొత్త పుచ్చకాయల రకాన్ని పంజాబు వ్యవ సాయ విశ్వవిద్యాలయం (లూధియానా) వారు విడుదలచేశారు.

ఈరకం ఇప్పటి మేలిరకంకన్నా 55 శాతం అధికంగా కాయలనిస్తుంది; దీని కాయలు ఇప్పటి రకాలకన్న ఎక్కువ తీయగా వుంటాయి.

'ఇంప్రూవ్డ్ షిప్పర్' రకం అమెరికా నుండి కొనిరాబడింది.

### నర్మద- 4 క్రొత్త గోధుమ వంగడం

ఇటీవల జబల్‌పూర్ (మధ్యప్రదేశ్) లోని జవహర్‌లాల్ నెహ్రూ కృషి విశ్వ విద్యాలయంవారు రూపొందించిన 'నర్మద-4' అన్న గోధుమరకం నీటి వసతులులేని ప్రాంతాలకు అనువైనది. ఈ వంగడం నల్లతుప్పు, గోధుమరంగు తుప్పు తెగుళ్లను నిరోధించుకుంటుంది.

వర్షాధారపుపైరుగా ఇది హై.11, ఎన్. పి. 832, హై. 633 వంటి రకాలకన్న 10-15 శాతం అధికదిగుబడి నిస్తుంది.

### క్రొత్తటొమేటో రకాలు

ప్రస్తుత పురకాలకన్న 35 శాతం ఎక్కువ దిగుబడినిచ్చే క్రొత్త టొమేటో రకాలను పంజాబు వ్యవసాయ విశ్వవిద్యా లయం (లూధియానా) వారు విడుదల చేశారు ఈ రకాలు "సెలక్షన 216", "శక్రూత్", "శక్రూత్-1".

ఈ మూడింటిలోను-అత్యధిక దిగుబడి (ప్రస్తుతపువాటికన్న 35 శాతం అధికం) ఇచ్చేది సెలక్షన 216. ఈరకం మొక్క బాగా ఏపుగా పెరుగుతుంది. ఆకులు దట్టంగావుండి పండ్లు ఎండకు పగిలి పోకుండా నివారిస్తాయి.

శక్రూత్ ప్రస్తుతపు రకాలకన్న 16 శాతం అధికంగా దిగుబడినిస్తుంది. దీని పండ్లు పెద్దవిగా, గుండ్రంగా వుంటాయి.

శక్రూత్-1 రకంలో గుత్తికి 5-7 పండ్లుంటాయి; ఇది దేశవాళీ వాటికన్న, 10 శాతం ఎక్కువ దిగుబడినిస్తుంది

### చేదులేని కాకరకాయ

రుచికి చేదుగాకాక కమ్మగావుండే కాకరకాయ రకాన్ని పోర్బందర్ (గుజ రాత్)లో రూపొందించారు. దీనిపేరు "ప్రైడ్ ఆఫ్ సౌరాష్ట్ర". ఇది పొట్టిరకం.

దీనికాయలు గుండ్రంగా, తెలుపు కలి సిన ఆకుపచ్చరంగులో వుంటాయి. ఈ రకం అన్నిరకాల నేలలలోనూ పెరుగు తుంది; కాని ఇసుక గరుముగా, నల్లరేగడి నేలలూ దీనికి అనువైనవి.

ఫిబ్రవరిలో దీనిని నాటితే 45 రోజులకు కాయలు కాస్తుంది; నవంబర్‌దాక కాయలు లభిస్తాయి. -[ఎఫ్ ఐ. యు.]

---

## బాంగ్లాదేశ్

(6 వ పేజీకొరవ)

గ్రామాలలో పటిష్ఠమైన ప్రతిఘటనా కమిటీలు ఏర్పడుతున్నాయి. ముస్లిం లీగ్ ద్రోహులను ప్రాముఖ్యమున్న గ్రామాలలో చంపివేస్తున్నారు. మాకిదో తీరనిఘోరంగా తయారయింది. మాతో నే వున్నట్లు నటిస్తూ శత్రువుకు సమాచారం పంపించే ద్రోహులు తలయెత్తుతున్నారు. కాని వారివలని గ్రామాలలో మావారు తేల్చి వేస్తున్నారు." అనేశారు ఇన్‌ఛార్జ్‌మేజర్ ఆఫీసరు. యూరోపియన్లనే విప్లవప్రభుత్వ కేంద్రం రెండు ప్రాంతాలనుండి మార్చ వలసి వచ్చిందని- ఆ కేంద్రాలను పాకిస్థాన్ ధ్వంసంచేసిందని- ఇప్పుడు- వారి పాలనా కేంద్రం కలకత్తాకు 30 కిలోమీటర్లలో- సరిహద్దుకు మూడుమైళ్లలో ఒక గ్రామంలో వున్నట్లు తెలుస్తున్నది.

అసంఖ్యాకంగా కనబడుతున్న యువ కులను- వీరుకొట్ల- షైపోర్టు- తీయాను- కో అర్డినేట్ చేసి- పద్ధతిగా పెట్టను తగి నన్ని వాహనాలు- ట్రాన్స్‌పోర్టు- రేడియా సిగ్నల్లు తక్కువగా వున్నాయి వీటిని ప్రోగుచేసుకుని పెద్దపెట్టున శత్రువును- మావ్ సీ టూంగ్- గెరిల్లా- తంత్రాలతో పల్లెలనుండి పట్టణా- చుట్టుముట్టి ధ్వంసం చేసే వలయ- వ్యూహ- రచిస్తున్నారు.

బాలాకాలం ఇది కొనసాగితే- పాకిస్థాన్ తట్టుకోలేదు. ఆర్థికంగా దివాలాతీస్తుంది. సైనికంగా దెబ్బతిని ఓడిపోని ఆ గెరిల్లా వాలి. కావున యీ ప్రతిఘటనను తన్ను మూర్ఖాలు పట్టించని గిన్నీ హిండూ ఇండియా కుట్రగా చిత్రించి భారతదేశంలో మతద్వేషమ్ములు సృష్టించను ప్రయత్నాలు జరుగుతున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువు లను యీ కారణాలన తరిమగొట్టుచు హిం సిస్తున్నారు ఇండియాకు అసంఖ్యాకంగా తరలివచ్చే కాందిశీకులలో వారి విజయమును పంపి మతద్వేషమ్మలకు ప్రయత్నిస్తు న్నారు కాశ్మీరు, నాగా, మిజో భూభా గాలలో కల్లోలాలులేవను ప్రేపిస్తున్నారు. ఆ విధంగా భారతదేశానికి ఇదొక పెద్ద సమస్యగా తయారవుతుంది. ఒక కోటి అయినా కాందిశీకులను పోషించాలి బంగ్లా దేశం చుట్టుప్రక్కల నున్న వారి భారత దేశమే కావున పోరాట ప్రభావం- దాని రాజకీయ ప్రభావం- ప్రధానంగా భారతదేశంలో పడతాయి. అనే అభి ప్రాయాలు మాకున్నా అంటే వాపక- సూపర్ గారు.

మత వద్దతిలో దేశవిభజన జరిగితే ఇది కాదంటారా? అని ఒక విలేఖరుడు అన్నప్పుడు- "కావచ్చును కానీ, దీని కాళ్ళూచేతులకూ ఏమయినాకూ అవ్వకు కూడా మన్నెంగా మహమ్మదీయనాయకులు పశ్చిమ బంగాలనాయకులతో చేసిన సమ్మతిని పాకిస్థానంలో పాకిస్తానులో కలపవద్దని, బెంగాలును ఒక ప్రత్యేక దేశంగా ప్రకటించవలసిదా కోరారు. అంటే పాకిస్తానులో వున్నదేశాలేమారుగా ప్రత్యేకదేశంగా వుండదలంటే మూడు ముక్కలుగా ఇండియా వుండిపోవదమే కదా? అప్పుడూ యీనాడని అల్లక అదే రూపం ధరించదనే గ్యారంటీ ఏమిటి?" అని మరొక విలేఖరి సమాధానం

— — (పూర్తయింది)

---


### నెల్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్టు మునసబ్ కోర్టులో

E. P. No. 150 of 1966

O. S. No. 149 of 1956

నెల్లూరు మున్సిపల్ కౌన్సిలు—పిటీషనరు

మహమ్మదు ఇబ్రహీంసాహెబు

—రెస్పాండెంటు

ఈ డిక్రీదారీగాను నెల్లూరు గ్రామము లోని వార్డు నెం 28, అసెస్‌మెంటు నెం. 2611 రుగల పట్టా నెం. 1494/27 ఎ. యస్ నెం. 480/1 రు, య 1-82 బ్లు నెం. 482/2 రు, య 2-33 బ్లు కల్లు య. 4-15 బ్లుకో సమిష్టిన య 1-17 బ్లుకు పైకోర్టువద్ద 1-6-71 తేదిన వేలం వేయబడును. డిక్రీదారు విలువ రూ. 1000 సర్కారుపాట రూ 1000 లు.

—మేనకూరు మోహనరామరెడ్డి. పిటీషనరు అడ్వకేటు.

---

### రాజాం డి॥ ము॥ కోర్టులో

O. S. 175 of 69 E. P. 8 of 71

తట్టు అప్పలస్వామి వగైరాలు

—వాదులు (డి. హో)

కలిశెట్టి అప్పలనాయుడు వగైరా

—ప్రతివాదులు.

ఈ నెంబరు డి. హో. కు ప్రతివాదుల వల్ల రావలసిన అమలు మొత్తం ఖర్చులకు గాను జె. డి ల కాలాను శ్రీకాకుళంజిల్లా పాలకొండ తాలూకా రాజాం సబు డి కంచరాం గ్రామంలో నాయుడుచెరువు ఇన్నమవాలిపేర్ని జె 1/16 కు పిరాయితి పట్టా బావికు య 0-80 బ్లు పిరాయితి వల్లం గెడ్డవారమడి 1-వ ప్రతిగానున్న కంచరాం గ్రామంలో కరణెడ్డిభాలిచి ఉత్తరస్థలంలోయున్న [ఖా-వ] మునురు 14 మూరలు[ఖ-వ]సుమారు 30మూరలు కొలతలుగల డోర్ నెం 48 రుగల రెండు గదులు పెంకుటిల్లు నివేశనములు 2-వ బాబుగానున్నా 1-6-71 తేది న గ ల పైకోర్టులో వేలం జరుగును. గాన వలయు వారువచ్చి పాడవచ్చును.

| ప్రతులు | డి హో వాల్యు. | అమినాదాబ్కు సర్కారుపాట |
|---|---|---|
| 1-ప్రతి | — | రూ. 2400 |
| 2-ప్రతి | — | రూ. 4000 |

—ఎ. కామేశ్వరరావు. అడ్వకేటు.




కోడి ఆదాయం కోటి ఆదాయం అని సామెత-ఇటీవల కోళ్ల పెంపకం ఎంతగానో అభివృద్ధి అయింది. గృహపరిశ్రమగా ఇది ఎంతోమందికి జీవన వసతిని కల్గిస్తున్నది. పంటలు సరిగా పండని మేవాట్ ప్రాంతంలో రైతులు కోళ్ల పెంపకాన్ని చేపట్టారు; పోయిన జీవనం చేస్తున్నారు. పైచిత్రంలో ఎడమవైపు-కాలుపోయి వ్యవసాయం చేయలేని ఒకరైతు కోళ్ల పెంపకంతో బ్రతుకుతూ, ఒక అధికారికి ఏవో అడిగి తెలుసుకుంటున్నారు. అన్నచెల్లెళ్లు కోళ్లకు శ్రద్ధగా తిండిపెట్టడం ఎడమవైపు చిత్రంలో చూడవచ్చు.



# 40 ఏళ్లనాటి 'జమీన్ రైతు'లో

41 సంవత్సరాల క్రితం జమీందారీ రైతు ప్రథమ సంచిక 2-3-1930 తేది వెలువడిన తర్వాత పాఠకజనంలో ఏమే ఆశలు రేకెత్తించిందో ఈ సంపాదకీయ లేఖ సాక్ష్యం. ఆ ప్రథమసంచిక చదివిన 'రయితు సంఘాభిలాషి' అనే పాఠకుడు మరుసంచికలో (16-3-1930తేది) వ్రాసిన సంపాదకీయలేఖ చదవండి:

"అయ్యా, తాము దయతో పంపిన ప్రథమసంచికను పఠించితి, పరమానంద భరితుడనైతిని. రైతుల పక్షమున వారి హక్కులకై జమీందారులతో సంప్రదించి, వాదించి, అవసరమైనప్పుడు ఆందోళన చేసి, పేదరైతుయొక్క ఆర్థిక స్థితిని బాగు చేయుట మీ సంఘోద్దేశ్యములలో నొకటియని వినియుంటిని. ఆ యుద్దేశ్య మొక్క దానితో మీ పత్రికను స్థాపించితిరని నేను నమ్మను. ప్రస్తుత పరిస్థితులను, వ్యక్తులను పట్టి జమీందారులతో వాదనలు, రాజీలు, మీ మనస్సుల నాకర్షించియుండిన యుండవచ్చునేమోకాని, రైతులకు సరియైన ఆర్థికసూత్రములు, ఆరోగ్యమార్గములును, సద్వృత్తులను, బోధించి, బాధ్యతలను గరపి వ్యక్తిసౌఖ్యము, కుటుంబసౌఖ్యము, సంఘాభివృద్ధియు సిద్ధించునట్లు పాటు పడుట మీ పత్రికయొక్కయు, మీసంఘము యొక్కయు ప్రధానోద్దేశ్యముగ నుండునని నా నమ్మకము.

"లోకమున, యేవ్యక్తికైనను కొంత జ్ఞానమలవడజేసి, ప్రపంచమును పాత్రమును కండ్లయెదుట పెట్టినయెడల సామాన్యశక్తులు గలవాడు, తన జీవితమును బంధుమిత్రుల జీవితమును కొంతవ కొంత ఆనందదాయకముగ జేసుకొనగలడు. మానవుని జీవితము సౌఖ్యప్రదముగగాని, చింతామయముగగాని యుండుటకు, భగవత్కృప, అదృష్టము, అవకాశములు, ఇతరుల కోపానుగ్రహమును, మొదలయినవి సహాయపడుచుండినను, మానవుని కర్మయే అతని సుఖదుఃఖములకు గౌరవాగౌరవములకు విత్తనముగ నుండునని మీరెరుంగుదురు. రైతులకు, మానవ ధర్మములను, దేశాభివృద్ధికరములగువృత్తులను బంధుమిత్రులయెడ తనకు గల బాధ్యతలను, కుటుంబ పోషణోపాయములను నేర్పి, వారి జీవితములు, కన్నీరువాగులు గాక, సంతోషఝురులుగ నుండునట్లు మీ పత్రిక ప్రసాదించుగాక అని నాప్రార్థన.

"రయితులు పల్లెలలోను, పాళెములలోను వసించువారు. వారిహక్కులు వారెరుగరు తమబాధ్యతలును యెరుగరు. గ్రంథములు పత్రికలు యీ పేద పల్లెలలో ప్రవేశింపవు. అందుబాటులోనుండు ఏ పత్రికయైన ఐకోపాసమస్యలు, ఢిల్లీ బిల్లులు, మద్రాసు గుఱ్ఱపుపందెములతోనో నిండి యుండుటవలన పత్రికలు వారికి నిరుపయోగముగ నున్నవేమో! ఈ కొరంత తీర్చుటకు రయితుపత్రిక స్థాపించిన వారెంతయు అభినందనీయులు.

"రైతులకు వానలు కురియు యోగములు, పైరుపెట్టు తరుణములు, ఏ విత్తనము లేపూరనుండును, యెట్టి ధరలుండునది, వానలు లేనపుడు పైరు పంటలు సాగుబడిచేయు వివిధోపకరణములు మొదలయినవి కావలయును. లాభకరముగ తోచుచుండును. కోఆపరేటివ్ సొసైటీలు, పంచాయతీ కోర్టులు, తీరుబడి కాలము లభించు చిల్లర చేతివృత్తులు దుర్వ్యయములను తగ్గించుట, దుర్వ్యసనముల విక్కకుండుట మొదలగునవి వారికి చక్కగ తెలియవలయును.

"ఈ గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమమును, రయితుజనులయొక్క సర్వతోముఖ వికాసమును మనసునిడికొని పల్లెయందలి అశిక్షితులగు జనులయందు స్వయంకృషి, స్వాభిమానము, సౌఖ్యజీవనము పెంపొందించి, రయితుపత్రిక జమీందారుల యొక్కయు జమీందారీ రయితుల యొక్కయు అన్యోన్య గౌరవ మైత్రికిని ఐశ్వర్యములకును పునాదివేయుగాక.

—రయితు సంఘాభిలాషి.

ఇదీ ఆలేఖ.

—

## లోకవృత్తం

(3 వ పేజీ తరువాయి)

మనకు తెలిసినంతవరకు—తెలిసిందీ తెలియగలిగిందీ అత్యల్పం—త్వరగా ముందుకు పోదామనే సాబ్రీ బృందానికీ, వెనుకకు మరలిచూస్తూ కాస్త నెమ్మదిగా పోదామనే సాదత్ బృందానికీ పేచీ వచ్చింది. అది పరిష్కారంగాపడం అమెరికా శాంతిపథకంబాపతు సంప్రతింపులు జరగడం ఒక్కసారి సంభవం జనందున అపోహలు కొన్ని కలిగినవి.

ఆర్మీ, పోలీస్ శక్తులు స్థిరంగా సాదత్ వైపున నిలిస్తే, సాదత్ నెగ్గుకవస్తాడు. రష్యాతో గొడవ రాకుండావుంటే, తన ప్రత్యర్థులకు వెలుపలినుండి ప్రోత్సాహం రాదు.

అసలీ అరబ్ రిపబ్లిక్‌లో సాదత్—నాజర్—నజీబ్ కాండ ఆర్మీ విప్లవంతో ఆరంభమైనది. ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరం టర్కీలో సుల్తానును ఎగరగొట్టి ఆర్మీలోని యంగ్‌టర్క్స్ ముస్తఫా కెమల్‌పాషా నాయకత్వాన నూత్నరాజ్య స్థాపన చేసినట్లుగానే, ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం సుదీర్ఘ కాలానికి ఈజిప్టును పాలించే ఫరూక్‌హయామును అంతమొందించి, నజీబ్ నాయకత్వాన యువకులైన ఆర్మీఆఫీసర్లు నూత్న రాజ్య స్థాపన చేసినారు. కొంతకాలానికి నజీబ్ ఎగిరిపోయి నాజర్‌వచ్చాడు. నజీబ్ నేరమేమో ఇప్పటికీ మనమెరుగము.

నజీబ్‌తర్వాత నాజర్ కనిపించగానే ప్రజలు చేజేలుచేశారు. నాజర్ మరణించి సాదత్ రాగానే జయజయధ్వానాలుచేశారు. ఇప్పుడు తనపై 'కుట్ర' పన్నినవారిని, వందలకొలదిగా జైళ్లలో త్రుక్కినా, సాదత్ ప్రజల జోహార్లను అందుకుంటున్నాడు. రేపు కాలకర్మవశాత్తు సాబ్రీ విడుదలైవచ్చి సాదత్‌ఖాయిని లోపలికి పంపించి, కొన్ని వందలమందిని తన హయామునకు గిట్టనివారని తాను తలచుకున్నవారిని బందిఖానాలో పడవేసి, ఆర్మీ-పోలీస్‌దళాల మద్దతుపొంది మైదానంలోవచ్చి నిల్చుకుంటే సాబ్రీకి జై అని ప్రజలు నినాదాలిస్తారు.

నియంతలు పాలించే రాజ్యాలలో గద్దె పైకెక్కినవానికి బ్రహ్మరథం పడుతూ వుండడమే ప్రజల కర్తవ్యం. వానిని ఎదిరించే సాహసి ఎవడైనా సంస్కరణకు పూనుకుంటే, వాణ్ణి వానితోబాటు వచ్చే ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తారు అధికారులు. అప్పుడు అధికారుల చర్యను కొందరు మెచ్చుకొంటారు, మరికొందరు తిరుగుబాటుదార్లను ప్రశంసిస్తారు. వీరు వారినీ వారు వీరినీ నానా దుర్భాషలాడుకుంటారు.

ప్రజాస్వామిక రాజ్యాలలో ఇటువంటి తొందరలుండవు. అభిప్రాయ భేదాలను అదరిస్తారుగాబట్టి 'కుట్రలు' వుండవలసిన పనిలేదు. గద్దెపైవున్నవారు—దానినుంచి దిగినవారు పగసాధింపులకు పూనుకోరు. అటువంటి నాగరిక జీవనం పొందడానికి నియంతల రాజ్యాలకు చాలాకాలం పడుతుంది.

అందువలన ఆదేశాలలోని 'ప్రత్యర్థులకు' 'కుట్రదారులకు' ఇత్యాదులకు తమవాదాన్ని లోకానికి తెల్పుకోడానికి రక్షణఅవసరం.

. . .

ఇంకొక రకమైన గందరగోళం సింగపూర్‌లో జరుగుతున్నది. ఆరాజ్యం జనసంఖ్య ఇరవైలక్షలు. అందరు సంపన్నంగా, ఉన్నత జీవన ప్రమాణాన్ని అనుభవిస్తూవున్నారు. సింగపూర్‌లోని ఆనందాన్ని అనుభవించదగునేకాని వర్ణించ నలవికాదని కొందరి అభిప్రాయం. అటువంటి సింగపూర్‌లో ఒక క్షోభవచ్చిపడింది.

ఈరాజ్యపు జనాభాలో 76 వ శాతం చైనావారు. మిగిలినవారు మలే, భారతీయ, యురేషియా బాపతువారు వీరంతా సింగపూరీయులైపోయినారు. ఐనా పూర్వపు జాతులపేరిటనే సమాజంలో చలామణి అవుతున్నారు. చైనావారిలో చైనామీద అభిమానం మెండు. ఒక చైనావారి పత్రిక మొదట్లో తాయ్‌వాన్‌పక్షాన్ని సమర్థిస్తూ ప్రచారంచేసేది. అది పనికిరాదని హెచ్చరిక జేయబడినది. ఇటీవల ఆపత్రిక మావోచైనావైపు తిరిగింది ఆ రాజ్యస్థాపన మహోత్సవ సందర్భంగా పత్రికలో ఒక అనుబంధం వేశారు. ఇది మరింత ప్రమాదకరమని సింగపూర్ ప్రభుత్వం భావించింది.

ఈ పత్రికగాక మరిరెండు పత్రికలలో సింగపూర్ భవితవ్యానికి అనర్థకమని భావించే ధోరణి వ్యక్తమైనది. ఇంకొక పత్రికకు బాటుగా ఎక్కడనుంచో ద్రవ్యం వస్తుందని అనుమానం కలిగింది. ఆపత్రిక ఎడిటర్ (మన ఖాసా సుబ్బారావుగారివద్ద ఒకప్పుడు పనిజేశాడు) తన సహచరులతో కలిసి ఈవలికి వచ్చాడు పత్రిక పెత్తందార్లు తమకుదాటుగా ద్రవ్యరాశి ఎందుకు ఎక్కడినుంచి వచ్చిందో సంతృప్తికరంగా తెల్పుకోవలసివచ్చింది.

కొన్నిపత్రికలకు చైనానుంచి, కొన్నిటికి ఫిలిప్పైన్స్, మరికొన్ని పాశ్చాత్యదేశాల వద్దనుంచి ద్రవ్యం వస్తున్నదని అనుమానిస్తున్నారు.

ఇప్పటికి మూడు పత్రికలు మూతబడినవి. పత్రికాస్వాతంత్ర్యం భంగపడినందుకు రోదనచేయవలెనా లేక సింగపూర్ దూరదృష్టిని మన్నించవలెనా?

ఇండోనీషియాలో చైనావారిగాథ విన్నాం. మలేషియాలో, బర్మాలో చైనావారి నడవడి వివాదానికి కారణమవుతున్నది. తమ 'జాతి' వారి రాజ్యం ఒకచోట వుండగా, తాము కాపురం వున్న రాజ్యంలో పౌరులుగావుంటూ, ఏ విధంగా నడచుకోవలెను?— ఇదీ ప్రశ్న.

మలేషియాలో తమిళులు తమిళనాడుపై విపరీతాభిమానాన్ని తమ పత్రికలనిండా వెదజల్లినారని తుంకు అబ్దుల్ రహమాన్ (కీర్తిశేషుడు) ఆరోపించాడు. సింహళంలో తమిళులను ద్రవిడమున్నేత్ర కజగం DMK రెచ్చగొడుతున్నదని సిరిమావో ప్రభుత్వం పేర్కొన్నది.

మనసీమలోని ముస్లిములు-పాకిస్తాన్ సంబంధాలలో ఇదేగదా గొడవ?

ఈసమస్య సింగపూర్‌లో ఏవిధంగా పరిష్కారమవుతుందో చూదాం.

—

## వారం…వారం…

(3 వ పేజీతరువాయి)

ఉత్పత్తిశక్తి ననుసరించిన ఆదాయాలను ఆధారంజేసుకుని ముచ్చటించడం మంచిదనికూడా లేబర్‌మంత్రి సలహాఇచ్చారు.

. . .

అది పరిశ్రమల సంగతి, ఇతరత్రా కూడా వెనకబడివున్నవారి సంగతి శ్రద్ధతో పరిశీలించదగినది మెరిట్ పొందిన బాక్‌వర్డ్, షెడ్యూల్డ్ తరగతులవారికి స్కాలర్‌షిప్పులు హెచ్చుగాయిచ్చి, వెనకబడినవారిని ప్రోత్సహించే పథకం అమల్లోకి రానున్నది. ఈ విధంగా ఇంకా కొన్ని అంశాలలో వెనకబడినవార్ని ముందుకు నెట్టే ఆలోచనలు జరుగుతున్నవి. ఇవన్నీ మంచివేకాని వెనకబడి వుండడం ఒక స్వార్థంక్రిందకు రకూడదని ప్రధానమంత్రి సంక్షేమ సంఘాలకుల సభలో హెచ్చరించింది. వెనకబడిన తరగతులనేది తరగక పెరగడం విచిత్రమని ఆమె తెలియజేసింది. ఒకనాటికి వెనకబడినవారికి ప్రత్యేకంగా సదుపాయాలను కలుగజేస్తే ప్రత్యేక సంస్థలు పోవలెనుకూడా అమె అన్నది.

మన హరిజన హాస్టళ్ళు ఎట్లావున్నాయో మనకు తెలుసును. వాటి మేనేజిమెంట్ ఒక స్వార్థం. దానికి ప్రభువుల మద్దత్తు. ఇది ఎందుకో అందరికీతెలుసు. కాబట్టి ప్రభుశక్తిని వైవశం చేసుకునే వారికొనే మార్చువస్తేగాని ఈ అన్యాయాన్ని అరికట్టలేము. ప్రధానమంత్రివలె ఈ విషయంలో దృక్పథంగలవారు రాష్ట్రాలన్నిటిలో పాలనకురావడం అవసరం.

ఇప్పటి హరిజన హాస్టళ్ళ మేనేజర్లకు స్వార్థపరిహారం ఇచ్చిపంపినా తప్పలేదు హరిజన బాలబాలికలు బాగుపడతారు. అంతట వేరొక ఏర్పాటుజేసి హాస్టళ్ళను సరిగా నడపండి. హాస్టల్ అక్రమంగా, అన్యాయంగా నడిపినవారికి కనీసం అయిదేండ్ల కఠినశిక్ష విధించే శాసనం చేయండి. అంతేగాని, ఇప్పటి హరిజనహాస్టల్స్ ఒక్కక్షణం ఆ విధంగా సాగనివ్వరాదు హరిజన నాయకులకు, ప్రభువులకు అందరికీ కళంకం. హరిజనులలో వున్నతులయిన, నిస్వార్థపరుల విద్యాసమితిని స్థాపించి దానికివ్వండి హాస్టళ్ళ మేనేజిమెంట్, ఇప్పటి హాస్టళ్ళ మేనేజిమెంట్ సిగ్గుచేటు! హాస్టళ్ళలో చేరేవారికిచ్చే స్టయిఫండును ఇబ్బడిచేయండి. మంచి మేనేజిమెంట్‌లో బాలబాలికలకు దానివలన వుపకారం కలుగుతుంది.

## పంచాంగం

### జ్యేష్ఠమాసము

మేనెల 25 తేది మొదలు జూన్‌నెల 22 తేది వరకు జ్యేష్ఠమాసము.

### రోహిణికార్తె

మేనెల 25 తేది సాయంత్రం 4-05 గంటల మొదలు జూన్ నెల 8 తేది మధ్యాహ్నం 3-20 గంటల వరకు యుండును.

### ముహూర్తములు

మేనెల 29, 31, జూన్‌నెల 2, 3, 4, తేదులు పెండ్లిముహూర్తములు.

### మే తిథులు

| | | | |
|---|---|---|---|
| 29 శని | పంచమి | మ 3-22 | గం.వ. |
| 30 ఆది | షష్టి | సా 4-20 | ,, |
| 31 సోమ | సప్తమి | సా 5-37 | ,, |

### జూన్ తిథులు

| | | | |
|---|---|---|---|
| 1 మంగళ | అష్టమి | రా 7-11 | గం.వ. |
| 2 బుధ | నవమి | రా 8-57 | ,, |
| 3 గురు | దశమి | రా 10-46 | ,, |
| 4 శుక్ర | ఏకాదశి | రా 12-27 | ,, |

—నిమ్మగడ్డ వేంకటేశ్వరశాస్త్రి.


## భూమి అమ్మబడును

సూళ్ళూరుపేటకు దక్షిణముగాను 1 మైలు దూరములో ట్రంకురోడ్డు ప్రక్కన, 35 ఎకరములు, వరి, మిరప, సజ్జ, శెనగ, నిమ్మ మొదలగు పైర్లకు అన్నివసతులతో వున్నది.

వివరములకు:
పి. వెంకటేశ్వర్లు,
కచ్చేరివీధి,
సూళ్ళూరుపేట, (నెల్లూరుజిల్లా)


## ప్రకటన

ఇందువలన యావన్మందికి తెలియ జేయడమేమనగా: గూడూరు తాలూకా రాఘవాపురం గ్రామ కాపురస్తుడైన దాసు వెంకటయ్యఅనువానికి మాలో మొదటివారు కుమార్తెయున్నూ, రెండవవారు భార్యయున్నూ అయివున్నాము సదరు వెంకటయ్యకు వెంకటస్వామి అను కుమారుడున్నాడు. సదరు వెంకటయ్యకు రాఘవాపురంగ్రామంలో తన స్వయార్జితమైనట్టి మూడు యకరముల మాగాణి భూమిన్నీ, మూడు యకరముల తోటలున్నూ, షుమారు 90 అంకణముల యింటి జాగాయున్నూ కలవు. సదరు వెంకటయ్య జబ్బుతో లేవలేనిస్థితిలో వున్నాడు. అతని కుమారుడు వెంకటస్వామి త్రాగుడు వగైరా దుర్వ్యసనములకులోనై, సదరు ఆస్తులను పరాధీనము చేయదలచియున్నాడు అట్టి పరాధీనములు చెల్లనేరవనిన్నీ, సదరు ఆస్తులందు మాకున్నూ హక్కుకలదనిన్నీ తెలియజేయడమైనది.

-మద్దిపల్లి రమణమ్మ,
-దాసు చెంగమ్మ.


జవిమ్మావారి లివర్‌క్యూర్
పిల్లల లివర్, స్ప్లీన్ వ్యాధులకు

మా డాక్టరు ప్రతినెలా వచ్చెదరు.

| ప్రదేశం | తేది | సమయం పగలు | అడ్రసు |
|---|---|---|---|
| నెల్లూరు | 4 | 9 నుండి 12 వరకు | అజంతాహోటల్ - ట్రంకురోడ్డు |
| తిరుపతి | 5 | 9 నుండి 12 వరకు<br>3 నుండి 5 వరకు | హోటల్ భీమా అన్నెక్సి-లాడ్జింగ్ సెక్షన్. |
| చిత్తూరు | 6 | 9 నుండి 12 వరకు | యం.యస్.ఆర్. లాడ్జి మెయిన్‌రోడ్డు |
| చీరాల | 13 | 9 నుండి 12 వరకు | రాజ్‌మహల్‌లాడ్జి - రైల్వేస్టేషనువద్ద |
| గుంటూరు | 14 | డిటో | ది మెడికల్ స్టోర్సు, కొత్తపేట |
| తెనాలి | 15 | డిటో | కన్యకాపరమేశ్వరి సత్రం |
| రాజమండ్రి | 16 | 9 నుండి 12 వరకు<br>2 నుండి 4 వరకు | ఈశ్వరదాస్ అండ్ కో, యిన్నీసుపేట |

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్సు
48/1 రాయపేట హైరోడ్డు - మద్రాసు-4.
ఫోన్: 72539.


Edited, Printed and Published by N. Sree Ramamurthy at The Zamin Ryot Press, 170, Thipparajuvari Street, Nellore (A. P.)